ప్రబుద్ధాంధ్ర

కలాభివర్ధనీపరిషత్తుపక్షమున ప్రకటింపబడు మాసపత్రిక

సంపాదకుడు :— శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

సంపుటము ౫ } రాజమహేంద్రవరము డిశంబరు ౧౯౩౪ { సంచిక ౧౨

ప్రదోషం

కాశీసోమయాజుల శ్రీనివాసమ్మగారు.

(చిరంజీవిని శ్రీనివాసమ్మ విజయనగరం, మహారాజావారి కాలేజీలో ఛీఫ్ లెక్చరరు బ్రహ్మశ్రీ కాశీసోమయాజుల రామమూర్తిపంతులు ఎం. ఏ గారి మనుమరాలు. స్కూళ్ల ఇన్‌స్పెక్టరు బ్రహ్మశ్రీ కాశీసోమయాజుల వేంకటరమణరావుగారి కొమార్త. ప్రధానాంధ్రోపాధ్యాయులు బ్రహ్మశ్రీ మల్లాది విశ్వనాథకవిరాజుగారి శిష్యురాలు. వయస్సు పదిహేనేళ్ళే; కాని వర్ధమానచంద్రకళ. నిశితప్రతిభావంతురాలు. కాశీనగరమునందలి హిందూ యునివర్సిటీవారి మెట్రిక్యులేషను పరీక్షకు చదువుతున్నది. ఈమె భవిష్యజ్జీవితం తేజస్వంతమై ఆంధ్రనారీలోకానికి విశిష్టత సంపాదించబోతుం దని నమ్మడానికి బలమైన సూచనలున్నాయి. సరళమైన భావనాబలమూ, మధురమైన కవితాధారా, శక్తివంతమైన తన్మయీభవనయోగ్యతా కల శ్రీనివాసమ్మ రచన సంపాదించగలిగినందుకు మేము మిక్కిలీ గర్విస్తున్నాము.

సంపాదకుడు)

ప్రాగ్దిశాకాంతకు భాను డేమికావలెనో—అతఁడరుణదృష్టులతో కొంటెకొంటె చూస్తూ దవ్వుదవ్వుగా పోతున్నాడామెనుంచి. వానిహృదయం రాగమయమో క్రోధపూర్ణమో తెలుసుకొన యత్నింపకుండనే నక్షత్రాలంకారముల నమర్చుకుంటూ వున్నది తూర్పుదిక్కు. ఈయలంకారమంతా తన కొఱకే అని భావించుకొని రాగరసంతో వుబ్బిపోయి దోబూచు లాడుతున్నాడు చంద్రుడు. చిరకాలమిత్రుడికి మల్లే చంద్రుడికి స్వాగత మిస్తూ వుంది తూర్పుదిక్కు. తన హృదయ మెట్లున్నా వెలుపలికి మాత్రం చల్లదనమునే ప్రకటిస్తూ ఒరులకు కానరాకుండా ప్రాగ్దిశ యొడలొరసికొని పరుగిడుతున్నాడు ప్రభంజనకుమారుడు. ఆసూర్యుణ్ణి, ఈచంద్రుణ్ణి నడుమ వచ్చిన యీ ప్రభంజనుణ్ణి చూచి తాను తన సంపూర్ణ కుటుంబము నడుమ నున్నట్లు మురిసిపోతూ వుంది తూర్పుదిక్కు.

ఈ విచిత్రనాటకములు చూస్తూ తన్ను తాను మరచిపోయింది కళ.

కళ వొక దేవీస్వరూప మని వాడుక. ఆపల్లెలోని వృద్ధులు మొదలుకొని పసిబిడ్డల వరకు అందరూ ఆమెను హృదయపూర్వకంగా ఆరా

ధిస్తారు.......ఎందుకంటే—ఆమె వచ్చిన తర్వాత ఆవూళ్లో పాడిపంటలు చాలా హెచ్చయినవట. ఒకడు చంద్రుని చూచి ఆ మొఖం చూచినాడట —ఆనెలలో ౬౦౦ లాభం వచ్చిందట వాడికి. ఇంక అందరూ మంచములమీద నుంచి లేచి...

కళ ప్రకృతికి ముద్దుబిడ్డ. ప్రకృతి వొళ్లో ఆడుకొంటూ ఆమె వొక్కొక్కప్పుడు తన్నే మరచిపోతూ వుంటుంది. ఒక్కొక్కప్పుడు మెలకువతో ఈవిచిత్రనాటకం చూస్తూ దీనికి నాయికౌనాయకు లెవరా అనుకొంటుంది. ఒక్కొక్కప్పుడు స్వప్నసామ్రాజ్యంలో సంచరిస్తూ ఛాయావ్యక్తులను పలకరిస్తూన్నట్లు పలవరిస్తుంది. ఇప్పుడీ అవస్థలో వుంది కళ.

ఇంతలో కళకు కండ్లు మూసే రాకరు—

'శ్యామం?'

'చతుర్దశలోకాలూ ఒక్క రీలులోనే తిరిగిపోతున్న వేమో యీ మాటిని పెర్ఫారమెన్సులో?'

'రోజంతా తలుపు మూసుకొనే కూర్చున్నావేం గదిలో?'

'కళాదేవి నుపాసిస్తున్నా.'

'సంగీతం పాడుతూన్నట్లు లేదు—కవిత్వం కడుతున్నావా?'

'కవిత్వానికి దశ మళ్లిపోయింది...చిత్రకళ...'

'అబ్బో! పైమెట్టే! ఏదీ ఏదీ'

కళ ముఖం వికసించింది; శ్యామం హృదయం త్రుళ్ళింత లాడింది. కళ పెదవి విరిచింది; శ్యామం ముఖంలో నెత్తురు విరిగిపోయింది.

'రచన చాలా బాగానే వున్నది గాని మళ్లీ పురాణఫక్కిలో పడ్డావేం?'

'సుభద్రార్జునులు—వారు పురాణదంపతులైనా వారి ప్రేమ నిత్యయవ్వనం గలది. అయితే నీ కిది నచ్చలే దన్న మాట?'

'నువ్వు వ్రాసేవు గనుక నాకు చాలా చాలా నచ్చింది'

ఆతని పెదవులపై చిరునవ్వు తళుక్కున మెరసి వెన్నెలను వెక్కిరించింది.

'కళా! నిజంగా నీకు నామీద ఇంత ప్రేమ వుందీ?'

'బాగుంది! చాలా చక్కగా అడిగేవు! నిన్ను కాకుంటే ఇంకెవరిని నేను ప్రేమించవలె?'

'అయితే నా యింగ్లాండు ప్రయాణం నీకు బాధగానే వుంటుం దేమో!

'బా ధెందుకూ? నువ్వు ఐ. సి. యస్ పట్టా పుచ్చుకొని కలక్టరుగా వచ్చి యిండియా అంతా వుద్ధరిస్తూ వుంటే చూడడానికి నాకు ఆనందంగాదూ? కాని వచ్చేటప్పుడు ఒక పట్టాతోనే—వలె నని నాకోర్కె.'

ఇరువైపులనుండీ తరుమ బడుతూ వున్న చెవుల పిల్లి లా గున్నాడు శ్యామం.

... ...

'నిన్నటి కథ పూర్తిగా చెప్పివేయి. ఉమాబాల యెవర్ని చేపట్టింది? బాలచంద్రుడు గతి యేమైంది?' అంది కళ.

'తెల్లవారుఝామున బయలుదేరి నేను దూరదేశం వెళ్ళిపోతూవుంటే ఇప్పుడు ఆత్మకథ కాకుండా పైకథ లడుగుతావేం?'

'ఆత్మకథల కేముంది? ఎవరికి తెలియంది గనుక? ఇంతకీ ఆత్మవిషయం విస్మరించినప్పుడే ఆనందం. చెబుదూ—ఉమాబాల యెవర్ని పెండ్లాడింది? బాలచంద్రుడు—'

'తన్ను పెండ్లాడకపోయిన తర్వాత యింకెవరిని పెండ్లాడితే నేం? బాలచంద్రుడికి మాత్రం తన జీవితంలోని సౌఖ్యం అంతరించిపోయింది. లోకమంటే అతని కగ్నిహోత్రం లాగు కనబడ్డది—'

'సరే. వెర్రెత్తిపోయి దిక్కుమాలి దేశాల వెంబడి తిరుగుతున్నా డనో సన్యాసం పుచ్చుకొని లోకం విడిచి ఏకాకిగా యేమూలనో వున్నాడనో లేకుంటే దుఃఖభారం సహించలేక ఆత్మహత్య

చేసుకున్నాడనో కవిశేఖరుడు కథ ముగించి వుంటాడు.'

'లేకుంటే యింకెట్లా ముగించవలె?'

'మరో మార్గం లేదా? ఔనౌను. ఉన్నదేమో లోకసహజమైన మార్గం—ఉత్తమమార్గం. అది కావ్యాలలో పనికిరాదాయె.'

'ఏమది? చెబుదూ'

'ఉమాబాల ఒకడిని పెండ్లాడి యేలాగు సుఖంగా వుందో అలాగే బాలచంద్రుడు కూడా యింకొకతెను పెండ్లాడి సుఖంగా వుండడం రెండు కుటుంబాలూ అన్యోన్యంగా వుండడం—కథలకి కవీశ్వరులు ఇటువంటి పరిసమాప్తి యివ్వరేం?'

'చా చా! ఇందులో కల్పన యేముంది? రసమేముంది? కవిత్వమేముంది?

'ఔనౌను. బాలచంద్రుడధోగతి పాలైపోయినాడంటే లోకానికి ఉమాబాలమీద వొల్లమాలిన ఆగ్రహం వస్తుంది. అదే కాబోలు రసమంటే?'

'పోనీ గాని అంత ప్రేమించిన బాలచంద్రుణ్ణి'

'బాగుంది. తనకు ప్రేమ లేనప్పుడు ఆమె యింకేమి చేస్తుంది? ప్రేమించిన వాళ్లనందరినీ ప్రేమించడం స్త్రీకి వశమా? అది విధా? ఆలాగు చేయక పోవడం తప్పా? ఏమిటి శ్యామం—ఇంగ్లీషులో మహామహా గ్రంథాలన్నీ చదివేనంటావు—ఇదేనా నీకు గల్గిన లోకజ్ఞానం?'

'పోనీ—ఉమది తప్పు కాదు. కాని బాలచంద్రుడు మాత్రం ఆమెపై ప్రేమచేత జీవితం త్యజించడం—'

'చాలా నింద్యం. అసహ్యం. నిజంగా నా కతగాడి మీద కనికారం కూడా కలుగదు. అతడి భీరుత్వాన్ని చూచి నవ్వుతాను. అంతే. తాను పురుషుడై వుండిన్నీ అవస్థనతిక్రమించలేక—ఎదుర్కోలేక తుదకు తట్టుకోలేక మేకపిల్లలాగు అవస్థకు లొంగిపోవడం కంటే లజ్జావహమైన కృత్యం మరొకటి లేదు.'

'ఇది శాకుంతలం చెప్తున్నాదేమో?'

'శాకుంతలం—ఉత్తరరామచరిత్ర మాత్రమే కాదు భారతీయవాఙ్మయమంతా కూడా. అది వీరపద్ధతి. కావలసిన ఆడది దొరకలేదని చచ్చినవాడు కావలసిన కోటుగుడ్డ దొరకలేదని యెందుకు చావకూడదు? వాడికి లోకమెందుకు చంద్రశిలాప్రతిమ నిర్మించకూడదు?'

'పురుషుల హృదయతత్వాన్ని స్త్రీలు నిరూపిస్తే—'

'స్త్రీల హృదయతత్వాన్ని పురుషులు నిరూపించినట్లుండదేమో?'

'నువ్వు చెప్పిందీ నిజమే లే. అదో పద్ధతి. అదీ కొందరికి నచ్చవచ్చు'

'ఆకొందరెవరో చెప్పనా? నీవీరుణ్ణి మెచ్చుకొనే వాడు—ఇప్పటివారు—అనగా అతడి సమకాలికులు. నావీరుణ్ణి మెచ్చుకొనే వారు. పుట్టబోయేవారు. అనగా అతణ్ణి గాక అతని చర్యనే తెలిసినవారు'—

'నిజమే. ఒప్పుకొన్నాను—కాని నిన్ననిచ్చిన శశిరేఖాపరిణయం చదివేవా.'

'ఈరోజంతా నువ్వు సుభద్రార్జునులతో కూర్చుంటే మరి నేను చేసేదేమిటి? శశిరేఖాభిమన్యులతో ముచ్చటిస్తున్నా!'

'ఏలా వుంది గ్రంథం?'

'పద్యాలెంత మధురంగా వున్నవి!'

'భావములు?'

'అనుగుణ్యంగానే వున్నవి. రసం ఆదే పద్ధతి. కల్పనలు అవే'

'నాయికానాయకులు సంబంధం?'

'ఏముంది? లోకంలో చెలామణీ అవుతూన్న సంబంధమే'

విసువు పుట్టింది శ్యామానికి. ఎప్పటికీ తన భావం తెలుసుకోకుండా వున్నదే—అంత ముగ్ధా? కొంటెతనమా?

'ఇంతవరకూ పైకథలు ప్రస్తావించేము గనుక ఇంక ఆత్మకథకు వస్తాం.'

'నువ్వు మహాత్ముడివి కాబోతున్నావు కనుక నీయాత్మకథ వినదగే వుంటుంది. నాకు చెప్పడానికేముంది? నువ్వు చెప్తే నేను ఊకొడతా.'

'నేను రేపు దూరదేశం వెళ్తున్నాను కదా నీ మనస్సు భారంగా లేదూ?'

'భరించలేనంత భారంగా వుంది.'

'అలాగు కనబడవే.'

'కనబడాల నని లేదు. కనుకనే అభావాన్ని బలవంతంగా తప్పించుకొంటున్నా.'

'రేపు నాతో విజయనగరం దాకా వస్తావు కదూ'

'వస్తా. వాల్తేరు దాకా కూడా వస్తునా అని ఆలోచిస్తున్నా'

'అక్కడనుంచి మళ్లీటప్పుడు నీమనస్సు చెల్లాచెదరయిపోదూ?'

'నీమనస్సో?'

'నేను ట్రైనులోనుంచి క్రిందికురికి వేస్తానేమో!'

'చెప్పినానే. అధీరత్వమే నే నసహ్యించేది. ఆరైల్వే ప్లాటుఫారముమీద నువ్వొక నాటకరంగం చెయ్యదలంచుకొంటే నేను రానే రాను?'

'లోక మంతా నీలాగే శిలాప్రతిములు కావలె నంటావు నువ్వు'

'నేను శిలాప్రతిమను గాను. మానవకాంతను. అంతే.'

'అయితే నీహృదయంలో ప్రేమ వుందీ?'

'రామకోటిలాగు ప్రేమకోటి వ్రాసి భద్రాద్రి రాముడికి మళ్లీ నివేదించవలె నేమో!

'అయితే నేను ధన్యాత్ముణ్ణి. నేను తిరిగి దేశం వచ్చేసరికి ౪ ఏండ్లవుతు. ఇంతకాలం నువ్వు పెండ్లి లేకుండా నాకొరకు నిరీక్షించి వుంటావు?'

'కలిసివస్తే యీనడుమ పెండ్లాడతా ననుకో—అయినా నీ సెలవలు చూచుకొనే పెండ్లాడతా. డబ్బుమొఖం చూచుకోక నామొఖం చూచి నువ్వు పెండ్లికి తప్పకుండా వచ్చి తీరాలి. క్షమాపణవుత్తరాలు పనికిరావు. తెలిసిందా? కావలిస్తే ఆపెండ్లి ముహూర్తం నువ్వే యేర్పాటు చేయి.'

శ్యామం ఆతోటలోని చెట్లలో తానొక చెట్టయి పోయినాడు.

"ఏం శ్యామం! ఏమది? ప్రాణంతోనే వున్నావా?"

"ఎంత నవ్వులాట అయినా అంత మోటుమాట కూడదు.'

అతని కళ్లు వింత భావాలను వెళ్గ్రక్కుతున్నాయి. అతని మొగంలో అద్భుత తాండవిస్తూ వుంది. కావ్యభాషలో లతలలో ఆమె వక లత అయిపోయింది.

'సరే. రేపు ప్రయాణం లేదు కొద్దిరోజులలో నిన్ను పెండ్లాడి మరీ నేను వెళ్తాను—అప్పుడైనా వెళ్లా లని బుద్ధిపుడితే.'

ఈతుది మాట విందో లేదో చెవులు మూసుకొంది కళ. వొళ్లంతా ముచ్చెమటలు పోసింది. గుండె దడదడ కొట్టుకొంది. కాళ్లు చేతులు గజగజ లాడసాగినాయి—

'శ్యామం! మనం పశువులమా?' అంది కళ. అతని ఆశాదీపిక చటుక్కున ఆరిపోయింది. నిరాశతో 'ఏమి' అని కాబో లన్నా డతడు.

'అన్నదమ్ములూ అప్పచెల్లెం డ్రనే భేదం లేకుండా—'

'నువ్వు నాచెల్లెలివా? నేను నీ యన్ననా?'

'అత్త మగవాడైనా నాన్న ఆడదైనా మనిద్దర మేమై వుందుము?'

'అయితే యింతకాలం నువ్వు కల్పించిన ప్రేమ సాంతాని కర్థ మేమిటి ?'

'ఇదా నీకు పాడకట్టిన అర్థం! వెఱ్ఱివాడా! పవిత్రమైన ప్రేమకూ తుచ్ఛమైన మోహామునకూ సఖ్యం కల్పిస్తున్నావు. బుద్ధిమంతుడవే! భార్యాభర్తలకు సంబంధించిన దేనా ప్రేమ అంటారు? మనం ప్రకృతిని, తల్లిదండ్రులను, సహోదరులను, మిత్రులను, దేవదేవుని ప్రేమించలేదా? దానికి ప్రేమ అనే పేరు తగదా?'

'శ్యామం! నిన్ను సోదరుడవని భావించి ప్రేమిస్తున్నాను. క్షమించు.'

అతనికి పర్వతాగ్రంనుంచి పాతాళానికి పడిపోయినట్లయింది. కళ్లు చీకట్లు కమ్మాయి. ఏదో పురుగు తలలోని నరాలను కొరికివేస్తూ వుంది. ఓర్చుకొన్నాడు. నవ్వగలిగినాడు—మాటాడగలిగినాడు!

'అమ్మా! నువ్వు చెప్పింది నిజం. మనం ఆలుమగలం కావడం కంటె అన్నాచెల్లెలూ కావడం ఎంత యుక్తం! దూర మాలోచించినావు. మంచి చెప్పి విచారిస్తావేం? లే. ఏడవకు' అన్నాడు శ్యామం.

కళకు చీకటిలోనుంచి వెలుగులోకి వచ్చినట్లయింది. శ్యామం ఇంతకు ముందే వెలుగులోనుంచి చీకటిలో పడ్డాడు. పట్టరాని సంతోషంతో ఒక కేక వేసి కళ అతణ్ణి కౌగలించుకొంది. శ్యామం చిన్నబిడ్డను తీసుకొన్నట్లు ఆమెను గట్టిగా కవ్వుకొన్నాడు.........కాని వేళ వుండగానే కోడికూతకు ముందే శ్యామం బయలుదేరి వెళ్లిపోయినాడు. ప్రక్కమీదనుంచి లేవడమే కళ కంటికి ౪ ఏండ్ల కాలం, కాలరూపంతో సాక్షాత్కరించింది.

జెసూటు వృత్తాంతములు

మల్లంపల్లి సోమశేఖరశర్మగారు

క్రైస్తవమతమునందలి రోమను క్యాథలిక్కు శాఖా చారిత్రమున క్రీస్తు శకము పదునాఱవ శతాబ్ది ప్రథమపాదము ఒక స్మరణీయ మయిన ఘట్టము. ఆకాలమున ఒక వంక జర్మనీదేశమున మార్టిను లూథరు అమాయకు లగు ప్రజల మూఢవిశ్వాసము అను లోకువగా గొని రోమనుక్యాథలిక్కు పీఠాధిపతు లగు పోపులు చెలాయించు నిరంకుశకపటాధికారమునకు దన యసమ్మతిని దెలుపుచు, కొన్నికొన్ని విషయములందు వారిని ధిక్కరించి విప్లవధ్వజమును లేవనెత్తుచుండ వేఱొక వంక స్పెయిను దేశమున వారి యధికారము నింకను దృఢముగ బాదుకొల్పి మఱింత ప్రోది సేసి వారికి దివ్యనీరాజనముల నర్పించుటకు సెయింటు ఇగ్నేషియస్ మతాభినివేశముతో తీవ్రప్రయత్నములు సలుపుచుండెను. ఈ రీతిని రోమనుక్యాథలిక్కుమత ప్రపంచ మంతయు నల్లకల్లోల మయిన కాల మది.

ఆకాలమున క్రీ.శ. ౧౫౩౯-వ సంవత్సరమున తమయొక్క, తమ యిరుగు పొరుగు వారియొక్క ఆధ్యాత్మికాభివృద్ధికి పాటుపడు నిమిత్తము లయోలా సెయింటు ఇగ్నేషియస్ అను స్పెయిను దేశస్థుడు 'యేసుక్రీస్తు సంఘము' అను పేర నొక సంఘమును స్థాపించెను. ఈసంఘసభ్యు లెల్లరు

దారిద్ర్యమును వరించి, బ్రహ్మచర్యమును పాటించి, తమ సంఘాధ్యక్షునికి పరమాజ్ఞానువర్తు లయి మెలంగవలెను. ఇవి వారి శపథములు. వీనికి దోడుగ, మతాంతరులను, మతద్రోహులను ఉత్తమమార్గమునకు ద్రిప్పి వారికి బోధ చేసి 'సత్య మత' మిప్పించుటకు మతబోధకులుగా గాని, లేదా తమకు దోచిన మతి యేవిధముననైన క్రైస్తవమతమునకు సేవ చేయుటకు గాని ప్రధానమతాచార్యుడగు పోపు తమ నెక్కడకు బంపిన నక్కడకు వెళ్లవలెనను మఱియొక విధి కూడ గలదు. పూర్వోక్తశపథముల ననుసరించియే వా రొక విధముగ సన్యాసులని తేటతెల్ల మగుచున్నది. చక్కని కట్టుబాటుల మీదను, నిశిత మయిన శిక్షణపద్ధతుల మీదను ఏర్పడిన యీవ్యవస్థను క్రీ.శ. ౧౫౪౦వ సంవత్సరమున పోపు తన యామోదమును దెలుపుటయే కాక, మార్టిను లూథరు వలననుండి రోమనుక్యాథలిక్కుమతమున కుపద్రవము సంభవించుచుండిన కాలమున తన్మతమున కండగ నుండుట కేర్పడిన దగుటచేత ఈసంఘసభ్యుల కంతవఱకు తన క్రింది మతాచార్యుల కెవ్వరికి నొసంగని మర్యాదలను గౌరవప్రపత్తులను కూడ నిచ్చి వారి నాశీర్వదించెను.

సంఘము కొరకు వ్యక్తి కాని వ్యక్తికొరకు సంఘము కా దన్నది వీరి లక్ష్యము. సెయింట్ ఇగ్నేషియసే ఈసంఘసంప్రదాయమునకు ౧౫౪౧ మొదలు ౧౫౫౬ వఱకు నధిపతిగా నుండెను. సంఘమున జేరిన వార లెల్లరు బాగుగ చదివిన విద్వాంసు లగుటవలనను, పట్టుదలతో తమ కార్యక్రమమునకు పూనుకొని పని చేసినందువలనను అతిశీఘ్రకాలముననే యీసంఘ మాకాలమున పేరు బ్రోగిన సంస్థలలో నొక్కటి యయినది. ఈసంఘమునందలి సభ్యులనే ప్రజలు 'జెసూ' ట్లని, 'జెసూట్ ఫాదరు' లని వ్యవహరించుచు వచ్చిరి.

జెసూట్లు యూరోపునందలి యున్నతతరగతుల వారి కుపాధ్యాయు లయి, అప్పటికి వాడుకలో నుండిన విద్యాశిక్షణపద్ధతియందు పెక్కు మార్పులు తెచ్చిపెట్టి విద్య నెంతయు నభివృద్ధి నొందించిరి. పెద్దపెద్ద జమీన్ దారులును, చిన్నచిన్న సంస్థానికులును గూడ తమ పిల్లలను చదువు నిమిత్తము వీరి కడకే పంపుచువచ్చిరి. ఈరీతిని ప్రజలలోను, పెద్దపెద్ద సంస్థానములలోను చిన్నచిన్న సంస్థానములలోను గూడ వీ రెక్కువ పలుకుబడిని సంపాదించిరి. తుద కాత్మలాభము కొఱకు పరనష్టము కొఱకు అతివిస్తరిల్లిపోయిన తమ పలుకుబడి నెక్కడ వారు వినియోగింతురో యని పూర్వపు మతగురువులును, విద్వాంసులును గూడ భీతచిత్తు లైరి. తుదకు విశ్వవిద్యాలయములు కూడ వారి పలుకుబడికి భయవిహ్వలము లయినవి.

పోపు ప్రసాదించిన విశేషగౌరవమర్యాదల వలనను విద్యామూలమున సంస్థానములందు తమకు చేకూరిన విశేషము పలుకుబడి వలనను వారికి అతిశయాహంకారగర్వములు ప్రబలినవి. తుదకు తమకు నియత మయిన కార్యరంగము నతిక్రమించి వారు ఎచ్చట నున్న నచ్చటి రాజకీయములందు కూడ అనవసరముగను, అప్రస్తుతముగను జోక్యము కలిగించుకొనుచువచ్చిరి. ఈకారణమున వీరికిని, రాజకార్యధురంధరు లగు వారికిని నడుమ ఈర్ష్యానుమానద్వేషములు మొలక లెత్తి క్రమముగా వర్ధిల్లినవి. మొట్టమొదట అత్యున్నతభావములతో నేర్పడిన యీసంఘము కొన్నికొన్ని నీతినియమములు శిథిలము లగుటవలనను, పూర్వోక్తాది ఇతరకారణములవలనను అపప్రథకు బాల్పడి తుదకు ప్రజల యాగ్రహానాదరములకు గుఱియై చాల అవాంతరములకు లో నయినది. తుద కేతత్సభ్యుల చర్యల వలన ఈసంఘము నణచివేయవలసినంత వఱకు వచ్చినది. ౧౭౫౯ లో ఈసంఘమువారిని పోర్చుగలు దేశమునుండి వెళ్లగొట్టిరి. ఫ్రాన్సుదేశమున ౧౭౬౪ లో నీసంఘ మణచి వేయబడినది. ౧౭౬౭ లో స్పెయినునుండి, తరువాత పర్మా, మాల్టాల నుండి

జెసూట్లను దరిమివేసిరి. వీటి అన్నిటికంటె పిట్ట పిడుగువలె వచ్చి పడినది పోపు శాసనశ్రీముఖము. ౧౭౭౩ లో పోపు ౧౪-వ క్లెమెంటు ఈసంఘమును రద్దుపఱచుచు నొక శాసనము కావించెను. తరువాత మరల నీసంఘమును పునరుద్ధరించుటకు చాల ప్రయత్నములు జరిగినవి. తత్ఫలముగ ౧౮౧౪-వ సంవత్సరమున నీసంఘమునకు ప్రాణప్రతిష్ఠ జరిగినది కాని దానికి పూర్వపుదార్ఢ్యము కాని, శక్తి కాని, చురుకుదనము కాని కలుగలేదు. ఎట్లెట్లో జీవితము గడుపుకొనుచు నీసంఘ మిప్పటికిని ప్రధానముగ విద్యావిషయమున గృషి చేయుచున్నది.

ఆధునిక కాలమున మతబోధ నిమిత్తము క్రైస్తవులు యూరోపు విడిచి దేశాంతరముల కరుగుట పదునాఱవ శతాబ్దితో నారంభ మయినది. ఈకాలముననే యూరోపియనులకు అమెరికాఖండ మొకటియున్నట్టును, 'గుడ్ హోపు' అగ్రము దారిని హిందూదేశమునకు బోవుటకు మార్గాంతర మున్నట్టును తెలిసినది. అంతటితో తమ పొరుగున నున్న మహమ్మదీయులతో నొక మూల గ్రుద్దులాడుచు గూర్చుండక తమ మతమును విస్తరింపజేసికొనుటకు విశాలప్రపంచ మింకను గల దని తెలిసి వారు తత్ప్రయత్నములకు గడంగిరి. ముందుగ రంగమున కవతరించినవారు రోమనుక్యాథలిక్కులు. వీరు మతాంతరులకు బోధించి వారిని దమ మతమున గలుపుకొనుట పోర్చుగల్, స్పెయిను దేశపు వలస రాజ్యములలో నారంభ మయినది. అప్పటికే వర్తక వ్యాపారమున కని వచ్చి పోర్చుగీసువారు హిందూదేశమున రాజ్యసంపాదనమునకు బ్రయత్నించుచుండిరి. ౧౫౪౨ నాటికి హిందూదేశపు పశ్చిమ తీరమున నున్న గోవా రేవు పోర్చుగీసువారి యధీనముననే యుండెను.

౧౫౪౧ లో ఫ్రాన్సిస్‌జేవియర్ హిందూదేశమునకు వచ్చుటతో మతబోధ నిమిత్తము క్రైస్తవులు దేశాంతరములకు బోవుట ఆరంభ మయినది. ఫ్రాన్సిస్ జేవియరు ౧౫౪౨ వ సంవత్సరము మే నెల ౬-వ తేదీని గోవారేవున దిగెను ఆధునిక కాలమున మతబోధ నిమిత్తము దేశాంతరములకు బయలుదేఱిన మొట్టమొదటి క్రైస్తవమతబోధకుడే కాక హిందూదేశమునకు వచ్చిన మొదటి జెసూట్ ఫాదరు కూడ నితడే. ఇగ్నేషియస్ సాహచర్య ప్రభావములవలన అతడు నూతనముగ స్థాపించిన యేసుక్రీస్తుసంఘమున జేరిన మొదటి సభ్యులలో నీ జేవియ రొకడు.

ఫ్రాన్సిస్ జేవియరు హిందూదేశమునకు వచ్చి గోవా చుట్టుపట్టులను, ఇంకను దక్షిణమండలము లందును పూనికతో పని చేసి చాలమంది తక్కువ తరగతుల వారికి క్రైస్తవమత మిప్పించెను. పిదప ఈ ఫాదరు సింహళము, మలాకా, మొలక్కాసు లలో తాను వచ్చిన కార్యమును గొంతవఱకు సాధించి పిదప జపానుదేశమున కరిగి యచ్చట నొక 'మిషను' స్థాపించెను. అటు వెనుక, ప్రచారము చేసి చీనాదేశస్థులను గూడ రోమనుకాథలిక్కు మత మిప్పించు తలంపుతో నతడు చీనా దేశమునకు వెళ్లుచుండ, కాంటన్ నగరమునకు సమీపమున క్రీ. శ. ౧౫౫౨ లో చనిపోయెను.

అటుతరువాత జెసూటుఫాదరు లొకరితరువాత నొకరుగ అనేకులు హిందూదేశమునకు వచ్చిరి. అనతికాలముననే మధురయందు వారి 'మిషను' ఒకటి యేర్పడినది.

జెసూటుఫాదరులు తాము క్రైస్తవమత మిచ్చిన వారిలో నుత్తము లయిన దేశీయులనే మతబోధకులుగ నేర్పాటు చేసి వారిచేతనే తమ దేశీయుల మతమును ఖండింపజేయుచువచ్చిరి. మఱికొందఱు

జెసూట్ ఫాదరులు, రాబర్ట్ డి నొబిలి వంటివారు బ్రాహ్మణులలో బ్రాహ్మణులుగ నటించి బ్రాహ్మణులనుండియే హిందూమత సిద్ధాంతాదులను దెలిసికొని తన్మతము పయి దండెత్తి పరమతనింద, స్వమతస్తవముల మూలమున స్వమతాభివృద్ధి కావించుకొనుచువచ్చిరి. స్వమతాభివృద్ధికి పరమతఖండన మొక సాధనము కాబోలు.

ఏ దేశమునకు వెళ్లిన నక్కడ ఈ జెసూట్ ఫాదరులు అక్కడి ప్రజలతో గలసిమెలసి తిరుగుచు, తమ పని సాగించుచు, అచ్చటి రాజకీయవ్యవహారములు, ప్రజల మతాచారవ్యవహారములు మొదలయినవి వారినుండి తాము విన్న వానిని గుఱించి కాని, తాము స్వయముగ కన్న వానిని గుఱించి కాని తమ యధికారుల యాజ్ఞ ననుసరించి వ్రాసి పంపుచుండువారు. వీటికి జెసూటువృత్తాంతము లని నేటి వ్యవహారము. హిందూదేశమునకు క్రీస్తుశకము పదునాఱవ, పదునేడవ శతాబ్దులలో వచ్చిన జెసూట్ ఫాదరులు ఇచ్చటి దేశభాషలను గూడ నేర్చుకొని తరువాత వచ్చు ఫాదరుల, ఇతర క్రైస్తవ మతస్థుల యుపయోగార్థము దేశభాషావ్యాకరణములను, నిఘంటువులను గూడ రచించియున్నారు. దేశభాషలను బాగుగ నభ్యసించి, వ్రాయను చదువను ధారాళముగ ప్రసంగింపను నేర్చి వ్రాసిన వృత్తాంతము లగుటచేత జెసూటుఫాదరులు మన దేశమును గుఱించి వ్రాసిన విషయములు కొంత వఱకు అసంబద్ధము లయిన అతిశయోక్తులతోను, మతవిషయము లందసత్యములతోను నిండి యున్నను రాజకీయముగ నవి నుతరామూ కొట్టివేయదగినవి కావు. శాసనములవలన గాని, నాణెములవలన గాని, వాఙ్మయమువలన గాని విడని కొన్ని కొన్ని చిక్కులు ఈ జెసూట్ వృత్తాంతముల వల్ల విడుచున్నవి; అంతియ కాక లోపించి పోయిన కొన్ని కొన్ని చరిత్రభాగముల నివి విషయమును దెలిపి పూరింపజేయుటయు గలదు. అందువలన పదునాఱవ శతాబ్దినుండి మన దేశచరిత్ర రచనమునకు గల ప్రధానాకరములలో ఈ 'జెసూటువృత్తాంతము' లొకటి. ఇవి యన్నియు పోర్చుగీసు భాషయందున్నవి. వీటిలో జాల వఱకింకను ఇంగ్లీషు భాషలోనికయిన ననువాదము కాలేదు. విజయనగర చరిత్రరచనమునకును, తంజావూరు మధుర నాయకరాజ్య' చరిత్రరచనమునకును ఈ జెసూట్టు వృత్తాంతములు చాల ముఖ్యము. ఈ వృత్తాంతములలోని కొన్ని కొన్ని భాగములను బొంబాయి చరిత్రపత్రికయందు ఫాదరు హేరాసుగారును మధురనాయకరాజ్యచరిత్రమున స్వామినాథయ్యరుగారును ఇంగ్లీషులోని కనువదించి ప్రకటించి యున్నారు. ఆంధ్రచరిత్ర పరిశోధకుల్లలో ఏకొందఱయిన పోర్చుగీసుభాష నేర్చుకొని మన దేశచరిత్రమునకు సంబంధించినంత వఱకయినను అవృత్తాంతములను తెలుగులోనికి, ఇంగ్లీషులోనికి అనువదించుట అవశ్యకము.

తెలుగుదేశమునకు వచ్చిన మొట్టమొదటి క్రైస్తవ మతబోధకులు జెసూట్ ఫాదరులే. అందువలననే తెలుగున క్రైస్తవమతబోధకునికి పాదిరి (ఫాదరు—Father—శబ్దభవము) అని, వారి 'చర్చి'కి 'పాదిరిగుడి' అని వ్యవహారము వచ్చినవి.

నిజమైన పతివ్రత

కొడవటిగంటి కుటుంబరావుగారు.

మనవాళ్లు పతివ్రత అనే పదం చెవికి కంటకింపు అయే వరకూ అమల్లో ఉంచారు. ఇప్పటి కాలపు వాళ్లకు పతివ్రతాత్వాన్ని గురించి ఎటువంటి అభిప్రాయాలు ఉన్నవో గమనించి అమీద పూర్వ కాలపు పతివ్రత లెటువంటివారో ఆలోచిద్దాం. ఒక హరిదాసుగారు చెబుతూంటే గా విన్నాను—పతివ్రతలు మూడు రకాలట. మొదటి తరగతి పతివ్రత ప్రపంచంలో తన భర్త తప్ప మరి మగవాడు లేడని భావిస్తుందట. రెండో రకం ఆవిడ ఇతర పురుషు లందర్నీ అన్నలుగానూ తండ్రులుగానూ భావిస్తుందట. మూడో రకం పతివ్రత పరపురుషులమీద మనస్సు పోయినా అపుకుని తన భర్తతోనే కాలం వెళ్లబుచ్చుతుందట! పతివ్రతాత్వమంటే ఏమిటో విశద మౌతూనే ఉంది—రంకుతనం చెయ్యని మనిషి పతివ్రత!

ఇక అసలు పతివ్రతలను చూడండి! ద్రౌపదీ సీతా, దమయంతీ, చంద్రమతీ మొదలైన వాళ్లను తీసుకోండి. అందరూ తమ భర్తలను స్వయంవరం చేసుకున్నారు, అందరూ కష్టా లనుభవించారు. చాలా మంది భర్తలనించి ఎడబాటు కూడా పొందారు. కష్టాలను తట్టుకున్నారు. తమ భారం యావత్తూ భర్తల మీద పెట్టి "నువ్వే నా దైవం! ఏం చెయ్య మంటే అది చేస్తాను!" అనకుండా తమ ఆలోచనాశక్తి వినియోగించారు. విపరీత మైన ధైర్యం చూపించారు. వాళ్లను భర్తలయొక్క నీడ అనటం అమర్యాద అంటాను. రావణాసురుణ్ణి అంతకాలం ఒంటరిగా ఎదిరించిన సీత రాముడి నీడ ఎట్లా అవుతుంది? ద్రౌపది తన గొప్పతనం సత్యభామకు తెలుపుకునేటప్పుడు "ఏమో నమ్మా! వాళ్లనే దేవుళ్లుగా నమ్మి ఉన్నాను!" అని ఊరుకోలేదు. ద్రౌపది చెప్పుకున్న గుణాలన్నీ పతివ్రతకు అవసరమే. ఆ అయిదుగురు భర్తల భార్యను మించిన పతివ్రతలు పురాణాల్లో ఎక్కడా కనిపించరు. (పతియందు వ్రతం కలది పతివ్రత అనే ఉద్దేశంతో ఈపదం వాడటం లేదు; ఆధర్మ స్త్రీకి ఇది పర్యాయపదంగా వాడుతున్నాను.)

చిత్రాంగిని తీసుకుందాం. మాటవరసకు చిత్రాంగిని సారంగధరుడి కిచ్చా రనుకుందాం. అప్పుడు చిత్రాంగి మిగిలిన మగవాళ్ల నందర్నీ ఆడవాళ్లుగా చూస్తుం దనుకుందాం (అనుకోటాని క్కూడా కోతిగానే ఉంది!) అప్పుడు చిత్రాంగి ఉత్తమజాతి పతివ్రత అవుతుందా? కాదని నా వాదన. చిత్రాంగికి పతివ్రత కుండవలసిన స్థైర్యం, స్వతంత్రంగా ఆలోచించే శక్తీ రెండూ లేవు. జనక మహారాజు మొండికెత్తి సీతను—రాముణ్ణి వరించిన సీతను—మరోడి కిచ్చా డనుకుందాం. అప్పుడు సీత పతివ్రత అవుతుందా? అవుతుం దనే నా నమ్మకం. రాముడి మీద ప్రేమ ఆవిడ పతివ్రతాత్వాన్ని ఒకటో మెట్టు మీదినించి మూడో మెట్టుకు తోస్తుందా? ఎప్పటికీ తొయ్యదు!

ఈకథ కీ ఉపోద్ఘాతం చాలు.

* * * *

సీత కొత్తగా కాపరాని కొచ్చింది. ఆమెకింకా తన మామగారు చితికిపోయిన సంగతి తెలీదు; ఇరవై ఎకరాల మాగాణీ భూమీ, పది వేల రూపాయల కిమ్మతు ఇల్లూ మార్వాడీ అప్పు కింద తాకట్టులో ఉన్నట్టు తెలీదు. ముందు ఇంటి కొచ్చింది ఎసరు. సేటుగాడు రెండువేలకు ఇల్లు కొట్టేయించమన్నాడు. సీత మామగారి సహోదరుడు తెలిసి కూడా వచ్చి అదుకోకుండా ఊరుకున్నాడు!

"ఏమండీ? అట్లా ఉన్నా రేం?" అంది సీత మొగుణ్ణి. సీత మొగుడు నిట్టూర్పి జవాబు చెప్ప

లేదు. ఆఇంటిల్లిపాదీ ఊరందరూ ఎరిగిన విషయం — సీతకు వారం పది రోజుల్లో ఎట్లాగో తెలియబోయే విషయం — సీతకు తెలియజేయటం నామర్దాగా భావించారు! మర్నాడు సీత తోడికోడలు కుండ పగలేసి "బంగారం వంటి కొంప పోతున్నదో!" అని యేడవటం మొదలు పెట్టింది. అందరూ కళ్లనీళ్లు పెట్టుకున్నారు. ఆరాత్రి మొగుడి దగ్గిర్నుంచి సీత సంగతంతా లాగింది.

తొలికోడి కూసే వరకూ సీత నిద్ర పోలేదు. మతి చెడకుండా ఆలోచించ గలిగితేనే ఫలం ఉంది. గుండెకి బారెడు ఎడంగా అనేక ఆలోచనలు తట్టినై. అన్నీ తోసేసి ఒక తీర్మానానికొచ్చింది. వెంటనే గాఢసుషుప్తి ఆమెను ఆవరించింది.

మర్నాడు అందర్నీ చేర్చి సీత ఆలోచన ప్రారంభించింది. వాళ్లచేత కూడా ఆలోచింపచేద్దామని ఆమె ప్రయత్నం. కాని అందరూ మతిచెడి ఉన్నారు. అప్పుడందరితోనూ తన ఆలోచన చెప్పింది.

"నేను ఉద్యోగం చెయ్యబోతున్నాను!" అంది సీత. కల్లోలం బయలుదేరింది. ఒకరు నామర్దా అన్నారు. ఆడది ఉద్యోగం చేసి పెట్టే కన్న మాడి చస్తామన్నాడు సీత బావగారు. ఉద్యోగం చెయ్యటం కన్నా చాటుగా లంజరికమే మెరుగన్నాడు మామగారు. సీత మొగుడు విసుగ్గా అందర్నీ నోరు మూసుకోమన్నాడు.

"ఎందుకు మాటలు చూసి బెదురుతారు!" అంది సీత.

సీత పెట్టె తీసుకుని మేనమామ దగ్గిరికి పోయి ఉద్యోగం కావాలంది. సీతకు టైప్‌రైటింగ్ చాతవును. పదిహేను రూపాయలకు దమ్మిడీ ఎక్కువివ్వనన్నాడు. ఆయనదో రకం మనిషి. సరేనంది సీత. సీత ఉత్తరం అందగానే మొగుడు వచ్చేశాడు. అతనికి కూడా సీత మేనమామ ఆ ఇన్స్యూరెన్సు కంపెనీ తరఫున కాన్వాసర్‌గా ఉండటానికి అనుజ్ఞ ఇచ్చాడు. ఇద్దరి సంపాదనతో కూడా గడవటం బహు కష్టమయింది. పత్రికలకు సీత వ్యాసాలు రాసి ధనార్జన చెయ్యాలని చూసింది. కాని అదీ ఎక్కువ జయప్రదం కాలేదు.

తరవాత సీత ఆవూళ్లో ఒక నాటకసమాజం ఉంటే దాన్లో వేషాలు వెయ్యటానికి పూనుకుంది. కొంతకాలం అది చాలా లాభించింది కాని సీత చనువుగా మాట్లాడటం మరోవిధంగా తీసుకుని కంపెనీ ప్రొప్రయిటరు గారు కొత్త కండిషనులు మాట్లాడబోయినాడు. సీత నవ్వి "క్షమించండి! నేను చాలా పూర్వకాలపు దాన్ని!" అంది. ఆ రోజుతో ఆ ఉద్యోగం అయిపోయింది.

డబ్బు సంపాదించటానికి సీత చాలా ప్రయత్నాలు చేసింది కాని ఎక్కడికి పోయినా మగవాళ్లకు ఒకటే యావగా కనిపించింది. ప్రపంచంలో ఇంత మంది బాలెన్సు లేని మగవాళ్లున్నారని సీత ఎరగదు.

అనుకోని అదృష్టంగా సీతకు టాకీల్లో నటించే అవకాశం గ్రామఫోను కంపెనీ వారికి రికార్డులిచ్చే అవకాశం ఒక్కసారి వచ్చినై.

"నాకు పాడటం గాని నటించటం కాని చాతవునని నాకింతవరకూ తెలీదోయ్ — వాళ్లు పిలిచేదాకా!" అన్నది సీత నవ్వుతూ నేను మొన్న ఆమెను కలుసుకుని మాట్లాడినప్పుడు. "మగవాళ్లకు ఆలోచనాశక్తి లేదబ్బాయి. నన్ను నేకమంది మగవాళ్లు వెంటాడారు. ఆటువంటివి ఇష్టం లేనప్పుడు అవ్రేజయిపోయి మూర్ఛపోవటం అవివేకం. ఎవడో దార్ని పోయే కొక్కిరాయి కన్నుకొట్టటానికి మన మంచితనంతో ఏమీ సంబంధం కనిపించదు! అటువంటి వాటికి నావంటి ఆడది సంసిద్ధురాలై ఉండటమే కాక ఇంకోరి సహాయం కోరకుండా తట్టుకు రావాలి!"

సీతనూ మొగుణ్ణీ అత్తవారు చాలా కాలం కిందటే వెలేశారు! సీత మామగారు గౌరవంగా బతకగలందులకు ఒకటి తరవాత ఒకటి దొంగెత్తులు వేస్తూన్నట్టు తెలుస్తుంది!

నాటకాలు—పాత్రలు—భాష

ఉభయభాషా ప్రవీణ—దువ్వూరి సూర్యనారాయణమూర్తిగారు

నేటి కాలంలో చాలామంది నాటకాలే రాస్తున్నారు. ఇప్పుడు చాలా మంది దృష్టి "నాటకరచనాంతం పాండిత్యం" అనే దారిలో పడింది. అన్నిటికంటె రాయడంలో కష్టం కలిగించేది నాటకమే అని మన పెద్దల నమ్మకం. కాని నాటక నియమాలన్నీ మాసిపోవడం చేతనున్నూ, ఆ నియమాలమీద ప్రేక్షకలోకానికి ఆదరం తగ్గడంవల్లాను ఇప్పుడు నాటకం రాయడమంత సుఖం దేన్లోనూ కనపడదు.

ఈనాటకాలని మూడు రకాలుగా విభజించొచ్చు. పౌరాణికాలు, చరిత్రాత్మకాలు, సాంఘికాలు, అని. ఈమూడు రకాల్లోనూ సాంఘికాలకున్నంత చలామణీ ఈరోజుల్లో వేటికీ లేదు. ఏరోజు కారోజు చక్కని పేర్లతో ఈరకం నాటకాలు బయలుదేరుతున్నాయి. ఓమూల "రంగూన్ రౌడీ" బయల్దేరితే మరోమూల "రౌడీలకి రంకు మొగుడు" అనేది బయటబడుతోంది. ఓమూల "కాలేజీ గరల్" అని ఒకరు రాస్తే దాన్ని అణగతొక్కడానికి "కాలేజీ స్కాండ్రల్" అని మరోటి చలాయిస్తోంది. తాత్కాలికంగా నట ప్రేక్షకలోకంలో దేనికేనా "సక్కుబాయి" లా కాస్త పేరొచ్చిందంటే దాని కనేక ఫొటోలు మన్నాటికే తీసేస్తున్నారు మారు పేరులతోటి.

ఇప్పటి లోకంలో చాలామందికి దేవుళ్లమీదా పురాణాల మీదా నమ్మకం తగ్గడంవల్ల, అల్లాటి నాటకాలెంతటి మంచివైనా వెకటిస్తున్నాయి. అందువల్లే సావిత్రి లాటి పతివ్రత మొగుడి ప్రాణాలకోసం "యముడి దగ్గిర మూడు రాత్రుళ్లు పడుక్కొని ముచ్చం మూడు ముద్దు లిస్తాను" అన్నదనిన్ని, వేదకాలంలోంచీ ప్రసిద్ధిలో వున్న హరిశ్చంద్రుణ్ని కొడుకు "ఏమిటి వెధవ నాన్నా! అమ్మని నిప్పు ముంట్లో దిగమంటావు? నువ్వు దిగు కళ్లు మూసుకుని మేం ఇంకో నాన్నని తెచ్చుకుంటాం" అని కూక లేసినట్టున్నూ రాసే ప్రబుద్ధుల్ని చూసేం గదా? ఈరకంగా కంగాళీలు బయల్దేరుతున్నాయి. నానాటికి ప్రజల నమ్మకాలు అంతరించి ఇల్లాటి వాటి మీదే ఎక్కువ నమ్మకం ఆదరం కలుగుతోంది. ఇంకా యీ కశ్మలం చాలక కొన్ని బూతుల సంచికలు పబ్లీకుగా బయల్దేరడం కూడా చూస్తున్నాం. ఎక్కువమంది చందాదార్లు కూడా దీనికే. నిజమే మరి. "మధుసేవ" మీద ఉండే అప్యాయం మరో శాకుంతల మీద వుండదు. "చింతామణి" మీద వుండే కౌతుకం శ్రీరామాయణం మీద కలగదు గదా? ఇల్లా వుంది లోకానికి నాటకీయాభిరుచి......

సంస్కృతం వాళ్లు నాటకం రాయాలంటే దానికి బోలెడు నియమాలు చెప్పేరు. అంకాలు ఎక్కువుండకూడదని, సంధులుండాలని, నాందీ సూత్రధారులుండాలని, విష్కంభాదులు తప్పవని బిగించేరు. ఇంకా యిల్లాగే, కథ మాత్రం ఎల్లా వున్నా తగాదా లేదన్నారు. వాళ్లని పట్టే మన తెనుగువాళ్లు కూడా ఈనియమాలని పాటించేరు పెద్దలు. రాను రాను వాటిలో కొన్నింటికి ఫ్రొంచికట్టు చేసేరు. ఇక రాసే వాళ్లే యిలా వుంటే ప్రదర్శించే వాళ్ల విషయం చెప్పే దేమిటి? ఇప్పటి నటులు కొందరు తమకు కావలసిన చోట పద్యాలని తీసి ఇష్టం వొచ్చిన వాటిని చేరుస్తున్నారు. "నాన్సెన్సు, ఇది చాలా ఎఫెక్టుగా వుంది" అని దాన్ని కామెంట్ చేసి కొత్త సాంగ్సు నడుమ నడుమ "అసంపూర్ణ రామాయణంలా"

అతకడం. ఇల్లాగే విషాదాంతాలు సుఖాంతాలుగాను సుఖాంతాలు విషాదాంతాలు గాను మార్చి శృంగారంలో భీభత్సం, వేదాంతం, భక్తి, వీటిల్లో తా స్టోరీసు జేర్చి ఎవరి యిష్టం వొచ్చినట్లు వారు చేసి నాటకాలకి పేరు బలవంతాన్ని లాక్కొస్తున్నారు. కొసకి గంటలోనూ గంటన్నరలోనూ ఆడెయ్యడానికి తగ్గట్లు నాటకా లుండా లని స్పెషల్ గా కవుల చెయి పట్టి రాయించుగుంటున్నారు. ఇల్లాటి పరివర్తనం నాటక కళని ఉద్ధరించడ మంటారో నట్టేట్లో దింపడ మంటారో సహృదయులు నిర్ణయించండి.........

ఇంక పాత్రధారణాల విషయం చూస్తే గంపెడు రాయవలసి వుంది. ఈ విషయాలు చాలామంది ఎప్పటి కప్పుడే రాస్తున్నారు. ఐనా రెండు మాటలు. పిలకజుట్టుతోనూ పిడికెడు జంఝాలతోనూ గోచీతోనూ వీణబుఱ్ఱ పట్టుకుని పురాణాల్లో తిరిగే నారదమునీంద్రుడు ఉంగరాలు తిరిగి చెవులమీద పడే కటింగ్ జుట్టుతోనూ సైకిల్ కట్లతోనూ నాభిపర్యంతం వేలాడే రకరకం పూల దండలతోనూ ప్రవేశం. సంసారికళా, పతివ్రతా తత్వం నినదించే సావిత్రీ చంద్రమతీ పాత్రల్లో వంకర పాపిళ్లు, బోసికాళ్లు జబ్బలు తెగ్గొట్టిన రవికెలు, పవిటి పిన్నీసులు, నాజూకైన డాలర్ గొలుసులు, బర్మా సిగలతోటీ, కలకటా స్లిప్పర్లతోటీ ప్రత్యక్షం. ఆ ఫేసుపౌడరు మొహానికి బొట్టుండదు. ఇల్లా వుంటే ఆమె పతివ్రతో పచ్చి భోగందో ఆలోచించండి. ఐతే యీ చిక్కు పౌరాణికనాటకాల్లోనే గాని సాంఘికాల్లో ఎల్లా వేసినా ఎంత ఫేషనబుల్ గా వున్నా చిక్కులే దనుకోకండి. సర్వసామాన్యంగా నటు లందరికీ ఫ్రెంచికట్టింగు, క్రాపు, తప్పని తద్దినా లవడం చేతనూ, పైన చీరకట్టినా లోపున తొడిగే లాగో యీజారో సగం సగం కనిపిస్తూండడం చేతనూ, అక్కడా యీ బాధ తప్పలేదు. అభినయించేది తురకపాత్రైనా గడ్డం నున్నగా వుండక తీరదు. కొత్త గెడ్డాలు కట్టడం అసహ్యం గదా! "చింతామణి"లో బిల్వమంగళుడు లాటి పండితుడికి గూడా పై వాతావరణం పేత, నూనూగుమీసాలు మోచేతులు దాటిన సిల్కుషర్టు, ముగ్గులు దేరిన క్రాఫు, నడుస్తోంటే రోడ్లన్నీ బాగుచేసే బారగోచీ, చేతికి రిస్టువాచీ, చేతులో న్యూసుపేపరు కాలికి స్లిప్పర్లు, పైమీద గుడ్డ లేకపోవడం, మొదలైన లక్షణాలు అవశ్యా లవుతున్నాయి. ఇల్లా వున్నాయి పాత్రాభినయాలు...

ఇంక భాషావిషయంలో కవులు కూడా పాత్రల్ని ఎల్లా పోషిస్తున్నారో కొంత అనుకుందాం. ఈ విషయం మనం సంస్కృతంలోంచి తీసుగోవలసుంది అందులో

"ప్రాకృతం శౌరసేనీ చ నీచపాత్రస్య చ
స్త్రియః
పైశాచం మాగధం వా స్యాత్ పిశాచాత్యన్త
నీచయోః
యద్దేశ్యం నీచపాత్రం స్యాత్తద్దేశ్యం తస్య
భాషితం
భాషా తు సంస్కృతం ప్రోక్తం అనీచానాం
కృతాత్మనాం"

అని ఆయా పాత్రలకి ఆ భాషలు వాడా లని చెప్పగున్నారు. కాళిదాసాదు లల్లాగే వాడేరు. ఇది తెనుగు వారిలో మాత్రం బాగా అంటలేదు. గ్రామ్యం గాని వ్యావహారికం గాని వింటేనే తప్పని రకంలో చాలా మంది మన నాటకకర్త లున్నారు. ఇదీ సంస్కృతం పెద్దలు

" అపశబ్దం ప్రయుంజానో రౌరవం నరకం
భవేత్
ఏక శ్శబ్దః స్సమ్యక్ జ్ఞాత్వా స్వర్గే లోకే
కామధుగ్భవతి"

అని ముప్పి పెట్టినదే. కనకనే చాలా మంది పాత్రయొక్క పాత్రాపాత్రత తెలియకుండా నాటకాల్లో మాట్లాడించి స్వభావం చెడగొట్టేరు. వీరిలో ముఖ్యులు వీరేశలింగం పంతులుగారు. వీరి శాకుంతలంలో బెస్తవాని పాత్ర ఆరోజుల్లో అధమం "విద్వాన్" ప్యాసైన మనిషిలా మాట్లాడేడు. కాళిదాసు మాత్రం ఆ విషయం జాగ్రత్తగా వున్నా ఆపరిణామంలోకి వీరు దిగకపోడానికి కారణం మన పెద్దల వాసనే అనుకుంటాను.

రెండో వారు చిత్రనళీయకర్తలు కృష్ణమాచార్యులవారు. వీరు ప్రథితులైన నాటకస్రష్టలు. ఈ నాటకంలో అరణ్యంలో తిరిగే ఎఱుకలవాళ్లని. దాసదాసీజనాలని మంచి యమకంగా గ్రాంధికంలో మాట్లాడించేరు. వాడికి కవిత్వపరిచయం కూడా వుందని తెలియడానికి ఒకటి రెండు పద్యాలు కూడా చెప్పించేరు ఇంకా వంటింట్లో బాహుకునిచేత ఒక్కొక్క మాటుగా ౨-౩ పద్యాలు వరసగా చదివించేరు. ఇదంత యిబ్బంది చెయ్యదు గాని దీనివల్ల ప్రదర్శనానుకూలసృష్టి కవిగారికి లేదనొచ్చు. మొత్తం మీద గ్రాంధికంగానే అన్ని పాత్రలినీ మాట్లాడించేరు.

ఇహ వడ్డాదివారి నాటకాలని పరిశీలిస్తే వీరి "చండకౌశికం"లోని చండాలురు కూడా కవులు గ్రాంధికవాదులూ అయేరు. ఇల్లాగే వీరి "వేణీసంహారం" "మల్లికామారుతం"లో నూను. భట దాసీదాసులకైనా గ్రామ్యం లేదు.

జయంతి భావనారాయణగారి రచనలు కూడా యింతే. వీరి "సంగీతసభ" లో ప్రాతిగామిన్ని "సౌందర్యసతీమణి" లో చేడెలున్ను "ప్రత్యక్ష నారసింహం" లో రాక్షసచారులున్నూ వ్యాకరణ శుద్ధంగా భాష పఠించినవారే.

కస్తూరి శివశంకరకవిగారి "జలజాసౌభద్రీయం" లో కరిబలుడు పింగళుడు అనే రాక్షసులు కూడా గ్రాంధికభాషలోనే ములిగి తేలేరు.

ఇంకా చూపించాలంటే కోపల్లి వెంకటరమణగారి "శ్రీరామవిజయం"లోని కంచుకీ, త్రిజటలున్ను, పానుగంటి వారి "సారంగధర" లోని లవిత్రా కంటకులు తలారులున్ను, వేరి కాశీవిశ్వనాథవిద్వత్కవిగారి "పూర్వశాకుంతల" లోని సఖి, భటాదులున్ను, ద్వివేదివారి ప్రద్యుమ్నానందంలోను, పాతాళభేది సుబ్రహ్మణ్యకవిగారి "శ్రీరామపట్టాభిషేకం" లోని శూర్పణఖాదీర్ఘనాసలున్ను, బులుసువారి "కోసలసామ్రాజ్యం" లోని బాలుడు, శూర్పణఖారాక్షసాదులున్ను, వుమ్రే ఆలీషాగారి "చంద్రగుప్త" లోని చేటీసామాన్యులున్ను, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి "సాహసికరాజపుత్రం" లోని తురకసైనికులు, భటాదులున్ను, గూఢ పాత్రోచితభాషల్లో మాట్లాడలేదు ఇంకా శ్రీనివాసరావుగారు "హరిశ్చంద్ర" లో కాటికాపరి వీరబాహుని నోట గ్రాంధికంగా పలికించేరు. అందువల్ల కొంపలు మునగలేదు గాని, వాడు చూస్తే మాలాడు. వేషభాషలు చూస్తే ఐదారు నెల్ల దాకా అన్నహితవు తప్పుతుంది. శ్మశానం, శవాలూనూ, వాడు చూసే ప్రకృతి. అల్లాంటి వాడు తెగతాగి కుండలు బుజాన్నేసుకుని వచ్చె టప్పుడు. గ్రాంధికంగా మాట్లాడితే ఏమేనా సహజంగా వుంటుందా? అప్పుడు శ్రీలక్ష్మీకాంత కవిగారు పోషించిన వీరభాహుడులా వుండాలి చూడండి.

"తొలిగి పో నిండయ్యా! దొరలు పెద్దింటోణ్ని
తెలిసి సెప్పాపోతే। పలవా పొమ్మంతారు॥తొ॥
పబులు మీ కుకొక్కల। కట్టి యేస్కొండయ్యా
గభగాభ భౌభౌ మని। కరవవత్తుండయ్యా ॥తొ॥
వాచ నం తారూ మా। దోచ మంతారు నే
కాచెంత సరుకేస్తు। కాటి కల్తా వుంటె॥తొ॥"

ఈ పాట పాడుతూ జానెడు చుట్ట నోట్లో పెట్టుకుని తూలుతూ రంగం మీది కొచ్చిన వీరబాహుడే అందంగా వుంటాడో పైవారి వాడే గు

మ్మనిపిస్తాడో చూసే వాళ్లకే తెలుసు—కస్తూరి నరసింహంగారు కూడా తమ "నవహరిశ్చంద్ర"లో చక్కగా వీరబాహుడిచేత నటింపించేరు. ఇల్లాటి దృష్టి వుండి ఏ పాత్రని ఎల్లా నడపాలో తెలిసిన వారు కూడా వున్నారు. వీరిలో పెద్దలు గురజాడ అప్పారావుగారు. వీరు "కన్యాశుల్కం" రాసేరు. ఇందులో కథ నిత్యం జరిగే మనుష్యసంపర్కమైన సాంసారిక గాథ లాటిదే కనక అన్ని పాత్రలూ వ్యావహారికాన్నే మాట్లాడతాయి. ఇప్పటి కున్న నాటకాల్లో దీని కొచ్చినంత పేరు దేనికీ లేదు గదా!

రెండో వారు వేదం వేంకట్రాయశాస్త్రిగారు. వీరు "శాకుంతలం" లో బెస్తవాడిచేత.

"బెమ్మ నొట్టరాసిన బువ్వేదో। బెమిని పోను
గదా
దమెమె గానీ కమెమె గానీ। తప్పరాసు గెందా
మేకలు మింగే బేపన రొయ్యకి। మెత్త మణుసు
గందా!
ఏకలి సేసిన ఆకలి కోసం। యీ గ్రుసు దొప్పుగం
దా!"

ఈ రీతిగా నడిపించేరు. ఇది నిజంగా వినేసరికి ఎంతో జాలిగా వుంటుంది.

ముట్నూరి మంగిపూడి వార్ల "పుష్పవేణి" నాటకంలో భీముడు అనే దొంగ గ్రామ్యంగా గజదొంగలా మాట్లాడేడు. భాషకి తగ్గ భావాలు. కొచ్చెర్లకోటవారి "అపవాదతరంగిణి" లోని సేవకులు దాసీలు కూడా గ్రామ్యంగానే మాట్లాడేరు.

కాళ్లకూరి నారాయణరావుగారి "చింతామణి" లో నీచపాత్రలు గ్రామ్యంగానే మాట్లాడేయి. ఇది కూడా ప్రసిద్ధిలో వున్న నాటకమే అని అందరికీ తెలుసు.

ఇంకా ఇల్లాటిది బలిజేపల్లివారి "బుద్ధిమతీ విలాసం" లోనూ కనిపిస్తుంది. కేశవదాసుగారి "కనకతార" లోనూ వుంది.

ఐతే పాత్రోచితభాష వుండా లంటే ఏ వేనా కథల్లో సాయిబుపాత్ర వస్తే తురకంలోనూ ఇంగ్లీషుపాత్ర వస్తే ఆపాత్రలని ఆభాషలలోనే మాట్లాడించా లనిన్ని ఇవన్ని అర్థం చేసుకుని పాండిత్యం లోకుల కందటికి నటులకీ కూడా ఉండా లన్న మాటా? అని ఎవ రేనా అనొచ్చు. అయితే యిప్పు డున్న గ్రాంధికభాషా, పద్యాలు, సంపూర్తిగా తూచా తప్పకుండా మనవాళ్ళందటికీ అర్థం అవుతోందని పైవా రనగలరా? ఇప్పుడందులోనూ పాటలలో రాగాలు కళలు, సంగతులు చూసి సంతోషించేవాళ్ళే గాని అర్థం సరసంగా గ్రహించే సామాజికు లేరీ? అల్లా అర్థం గ్రహించేవారే సామాజికు లైతే "భమిడిపాటి కామేశ్వరావు"గా రన్నట్లు ఓమూల హరిశ్చంద్రుడేడుస్తోంటే శ్రీరాగ మెందుకు కాంభోజి యెందుకు? అరునాక్కౌ రాగం ఎత్తక. అద్రుస్సుతో వున్న శకుంతల మోకాళ్లు మణిచి కూచుని సడెన్‌గా నాటకం నడుమ అవ్వూలపాట లెందుకు? అప్రసక్తాలైన గ్రామఫోనురికార్డెందుకు? ఇంకా యిల్లాగే పెద్దపెద్ద ఫీలిరగ్సు చూపించి నాయకానాయికలు మూర్ఛపోయేటప్పుడూ "దళమా శయ్యేదలో నడంగియు" అనే పద్యం ఆఖరని హరిశ్చంద్రుడు చంద్రమతీ తాము భార్యాభర్త లమని తెలుసుకుని దభాలుని స్టేజిమీద పడేటప్పుడూ గొంతుక చించుకుని ఆ "కన్సుమోర్లు" ఎందుకు బాబూ? ఇదంతా అర్థం చేసుకునే ఆడే భాగోతమే ఐతే నటులు కూడా

"పాతకమున కేగి బ్రతుకవచ్చు నటన్న"

అనే పద్యం చదివేటప్పుడు రెండు చేతులు పైకిచాపి ఆకాశాన్ని చూపించి "యాక్షన్" చేయడం గూడా అర్థజ్ఞానంతో కూడిందే అనొచ్చు. కనక తెనుగులో ఏ సాయిబు పాత్రేనా పెట్టదలుచుకుంటే వాళ్ళ భాషలో వున్న పదాలనే మన తెనుగు పదాలతో కలుపుతూ తెనుగు ప్రత్యయాలు చేరుస్తూ మాట్లాడిసే అందం, ఇహ నీచపాత్ర లైనా పెట్టా లంటే ఏజాతికా యాస. మాటలో వచ్చేలా గ్రామ్యంగా నడిపిస్తే సొంపు. ఆదే ఆడే

టప్పుడు అద్భుతానందాన్నిస్తుంది చూడండి కవిరాజుగారి "బొబ్బిలియుద్ధం" అందులో హైదరజంగు గారి ప్రసంగం కథుర్లు, వేదంవారి "ప్రతాపరుద్రీయములో" సుల్తాన్ షోకు మాటలు చూస్తే సందర్భం గోచర మవుతుంది. ఎందుచేత నంటే

"భావా యే ఉత్తమానాం తు నతా న్మధ్యేషు యోజయేత్
తమే భావా శ్చైవ మధ్యానాం నతా న్నీచేషు యోజయేత్"

అన్నాడు కనక. ఇల్లాగే ఉత్తమభావా లుత్తములకి నీచభావాలు నీచపాత్రలకి పెడుతూ నీచభావాలకి సాయం భాష కూడా ఉత్తమం కాని దాన్ని పెడితే అప్పుడు మరీ బాగుండొచ్చు కాదూ? ఎంకి పాటలు ఈవుద్దేశంతోనే బయల్దేరేయి. మరిన్ని

"యో దేశభాషారహితం కావ్యం ప్రయోజయేత్
తస్యా వ్యభిలేఖ్యః స్యాత్ ఘాత సత్ జైహి దుష్టం దోషజ్ఞైః"

అన్నట్లు దేశభాష అనగా సార్వజనీనంగా వాడబడుచున్న వ్యావహారిక భాష, అది లేని కావ్యము దుష్టమని గదా పైదాని భావము. కనక పాత్రోచితభాష నాటకాలకి అందం తెస్తుంది.

అల్లా అయితే రాసే నాటకమే మ్లేచ్ఛులది గాని ఇంగ్లీషు పాత్రలతో ఇంగ్లీషు నాటకం గాని అవుతుంది. అప్పుడు మొదటి నించీ తురకభాషతోటీ ఇంగ్లీషుతోటీ రాయా లన్న మాటే. లేకపోతే ఉచితభాష కాక పోతుంది. అలా రాస్తే అది ప్రదర్శించడంలో అంద మెల్లా వుంటుంది? అప్పుడు అనువాదాలకి ఫలితం ఉండదే! అన కూడదు. ఆగాధలోనే ప్రధానపాత్రల విషయానికి గ్రాంధికాంధ్రం రాసి తక్కువ పాత్రలకి మాతృకభాషలో వుండే యాస కలిగేలా రాయడమే మంచిది. ఇల్లా రాసిన నాటకాల్లో "ఖిల్జీరాజ్యపతనం, దుర్గాదాసు" మొదలైన వున్నాయి. ఇందులో మొదటిది మ్లేచ్ఛగాధ. రెండోది హిందీ గాధ. ఈరెంటిలోనూ నేను చెప్పినట్లే పాత్రలు నిర్వహించబడ్డాయి. ఆంధ్రులకి కూడా అర్థం అయే లాగ నీచపాత్ర భాష వుంది. ఇల్లా రాసినందువల్ల నాటకం స్వభావసిద్ధంగా వుండి సామాజికులకు రసోత్పత్తి కలగ చెయ్యడంలో అభ్యంతరంలేదు. "బొబ్బిలియుద్ధం"లో బుస్సీదొర యింగ్లీషు మాటలు విసురుతూ చక్కగా మాట్లాడేడు. కనక నాటకకర్త లందరూ భాషలో పాత్రపోషణం చూచుకుంటూ ప్రదర్శనానుకూలంగా ఏ గాధలు రాసినా అందము తప్పి ఉండ దని నా మనవి—

ఇంకో మాట. మన లక్షణకర్తల్లో సరసులు కూడా గ్రామ్యాన్ని పాత్రోచితంగా వాడవచ్చని చెప్పేరు.

"అధమప్రకృతిషు గ్రామ్యోక్తి రుణః"
"గ్రామ్యం తత్ర ద్విధా సాధు"
"గ్రామ్యంబు తజ్జాతివర్ణంబులం బ్రయోగార్హంబగు" పైవాటిని పట్టి శిష్టప్రయోగాలు లేనిదే వారల్లా చెప్పరు గదా? ఆసూత్రాలకింద ఉదహరించిన ప్రయోగాలు కూడా పెద్దవాళ్లవే. చూడండి.

"నూసినా మేలు బాగెము, సేసినాము"

ఇది యయాతి చరిత్రలోది. గ్రామ్యజనం రాజుగారి దర్శనం చేద్దాం మనే సందర్భంలో అనుకుని మాట లివి. ఇల్లాగే మనుచరిత్రలోనూ వెంకటాచలమాహాత్మ్యంలోనూ సారంగధరచరిత్రలోనూ కూడా ఈపాత్రోచితభాషే వాడబడింది. వారు రాసేరనే కాకుండా ఏపాత్రని నాటకాల్లో ఎల్లా మాట్టాడిస్తే బాగుంటుందో ఎవరికి వారే ఆలోచించొచ్చు. దానితో పాటు కాలపరిస్థితిని జనుల రుచిని అనుసరించి అందులో అనుచితాన్ని బహిష్కరించి నాటకాలు రాస్తే అవి లోకంలో ప్రసిద్ధికెక్కి ప్రదర్శింపబడి నాటకత్వానికి సార్థకత్వం సంపాదిస్తాయి. ఇంతే నా వుద్దేశం—

కుంతి

మల్లాది అవధానిగారు

ఆ పదిహేనేళ్ళ అమ్మాయి ప్రతి రోజూ సాయంత్రం వేళ సూర్యుడు వెళ్ళిపోయిన వెనక క్రమ్ముకునే మసక చీకట్లలో మెల్లమెల్లగా తడబడే అడుగులతో గంగానదీతీరానికి వొస్తుంది. తీరాన యిసుకలో కూచుని మానవహృదయం మీదకు జెంగవలె నదిమీదకు వొరుగుతున్న చీకటిలోనికి, వొడ్డున లంగరు వేసి వున్న పడవల వేపూ ఆదేపనిగా చూస్తూ కూచుని యేమో యేమో ఆలోచిస్తూ వుంటుంది. అలానే ఆసమాధ్యవస్థలో యే నడిరేయి దాకానో వుండి వొక్కసారిగా నిద్రనుంచి వలె తుళ్ళిపడి లేచి తన చుట్టూను ఆకాశం వేపూ చూసి తొందర తొందరగా యింటికి వెడుతుంది.

ఆమెను అనదీతీరం రోజూ సాయంత్రం వేళ యెందుకు ఆకర్షిస్తుంది? అదంతా వొక కథ—

ఆర్నెల్ల కిందటి ముచ్చట.

అన్నట్టు—ఆ అమ్మాయి పేరు కుంతి. మొన్న శ్రావణానికి పద్నాలుగు వెళ్ళి పదిహేనో యేడు వొచ్చింది. కుంతి కన్యక. ఎర్రగా వుండవలసిన ఆమె బుగ్గలూ పెదవులూ పాలిపోయి తెల్లగా వున్నాయి. వెన్నెల మెరుగును గలిగి వుండవలసిన ఆమె కన్నులు మబ్బు పట్టిన ఆకసం వలె వున్నాయి. ఆమె నున్నని దేహానికి వుండవలసిన నిగనిగలు లేవు—అందుకు కారణభూత మైనదే యీ కథ—

ఆ సాయంత్రమూ, యీ సాయంత్రము లాగునే వుంది చల్లని గాలిలో 'గంగ' కదులుతూంది. నది మీదకు...అది శుక్లపక్ష మైనా...నునుచీకటి వొరుగుతూంది. వొడ్డున లంగరు వేసిన పడవలు యిలాగునే వున్నాయి. వినీలాకాశం వొక చుక్కను కన్నది.

ఆ అమ్మాయి.. కుంతి అదుగో అక్కడనే ఆయిసుకలో అదే విధంగా కూచుంది. కాని యిప్పటివలె అప్పుడు ఆమె మొహంలో ఆలోచనా, గంభీరతా లేవు. అప్పుడు ఆమె ...... చిన గులాబివలె వుంది. ఆమె కన్నులు బాగా వికసించినాయి. పెదవులు చిరునవ్వులకు యెరుపెక్కినాయి. అందుకు కారణం? ఆమె వొళ్లో వొక బిడ్డ వున్నాడు.

ఆమె ఆచిరుత వాని వేపు చూస్తూ కిలకిల నవ్వుతూంది. అతేశవానిని తన చేతులలో యెగుర వేస్తూంది; తన కౌగిలిలో నలిపివేస్తూంది, తన వక్షానికి అదుముకుంటూంది. అతని పాలబుగ్గలు యెర్రగా కందిపోయేవరకు ముద్దాడింది. అతని అరచేతులతో తన కన్నులను కప్పుకుంది. కిలకిల నవ్వింది. ఆ అబ్బాయిని బిగువుగా కౌగలించుకుని అతని దేహ మ్మంతా ముద్దుపెట్టుకుంటూంది. ఆ అబ్బాయి వుక్కిరిబిక్కిరయిపోయి వూపిరికోసం కలత చెందుతున్నాడు. ఆమె గుండె చటాల్న చెదిరింది. అబ్బాయి సేద దేరాడు. "అమ్మ!" అంది ఆమె. అతని వేపు అదే పనిగా చూసింది ఫక్కున నవ్వింది. ఆమె కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

అప్పుడే ఆకాశానికి చందమామవుదయించాడు. ఆకాశమంతా వెన్నెలతో నిండిపోయింది. ఒక్క ఆకాశమే కాదు—గంగానదీ.. యిసుకదిబ్బలూ ...చెట్లూ...అన్నిని.

అయినా ఆమె ఆచందమామను చూడలేదు. ఆవెన్నెలను చూడలేదు. ఆగంగానదిని...ఆ...ఆ వేటినీ చూడలేదు. తన కౌగిలిలోని పసికందు వేపు చూస్తూంది. "నాచిట్టీ! నాచిట్టీ," అంటూ నవ్వుతూంది. "నా చందమామా!" అవును. అతను తన చందమామే. తన రక్తం...తన ఆత్మ...తన హృదయం...తన సర్వమూను. ఆనందాన్ని పట్టలేక వలవల యేడ్చింది. ఆమె కన్నీటితో ఆపసికందు మోము తడిసిపోయింది. ఆమె గుండె ఝల్లు

ఉంది! అయ్యో! తన చిట్టితండ్రికి...అప్పుడు పుట్టిన పసికందుకి యిదా నీళ్ళపోత? తన కన్నీళ్ళతో నీళ్ళపోత! "నాన్నా! నాతండ్రీ! కుంతి కడుపున యెందుకు పుట్టావు?"

ఆమె తన పయ్యెదను తొలగించి స్తనాన్ని ఆపసివాని నోట్లో పెట్టింది. ఆ యెర్రని చిన్ని పెదవులు మెత్తగా మృదువుగా హాయిగా తన స్తనాన్ని పీలుస్తుంటే—! ఎంత హాయి!—తానెంత అదృష్టవంతురాలు!

"కుంతీ నువ్వు! కన్యకవు! ఆసంగతి మరిచిపోకు" అని యెవరో తనమనస్సు పొలిమేరల్లో నిలిచి చెప్పినట్లయింది. ఆమె గుండె ఝల్లు మంది.

లోకం!—తాను కన్యక...తనకు బిడ్డడు...!—లోకం!

ఆకాశ మనే నదిలో చందమామ కొట్టుకుపోతున్నాడు. చాలా రాత్రయింది.

ఆమె లేచి నిలుచుంది. తన బిడ్డను రొమ్మునకు మళ్లా మళ్లా అదుముకుంది. మెల్లగా ఘట్టాల దగ్గరకు నడిచింది. బిడ్డను వొక సారి ముద్దుపెట్టుకుంది. "నాన్నా! నాన్నా!" అని వొణికే గొంతుకతో ఆ అబ్బాయిని పిలుస్తూ కన్నీళ్లు విడిచింది. ఆ పసిబ్బాయి "అమ్మా!" అంటూ యేడ్చాడు. "అమ్మా! అమ్మా!" యెంత తీయగా వుంది ఆ మాట. ఆమె వెక్కి వెక్కి యేడ్చింది. ఆ అబ్బాయిని ఒక పడవలో వుంచింది. మళ్లా అతన్ని తీసి యెత్తుకుని మళ్లా పడవలో వుంచింది. పడవ లంగరు వొదిలివేసింది.

గంగానదిలో ఆపడవ యిటు అటు వూగుతూ మెల్లగా వెడుతూంది...జోరు...పడవ పరిగెడుతూంది. పడవ కానరాదు. దూరాన నదిలో వొక నల్లని చుక్క... అదీ మాయ మయింది.

అయినా ఆమె అటువేపే అలాగున చూస్తూ నిలుచుంది. పది నిమిషాలు—యిటు అటు చూసింది. "నాన్నా! నా చిట్టితండ్రీ" అని ఆయిసుకలో పడి బోరున యేడ్చింది ఆ కన్నె.

చాలా రాత్రయింది ఆమె యిల్లు చేరుకునే సరికి.

ఆమె రాత్రులు—

ఆమె నడిరాత్రి దాకా యేమో ఆలోచిస్తూ కూచుంటుంది. అపుడామెకు చిన్న కూర్కు పడుతుంది. ఆ మాయనిద్రలోనూ ఆమె తన పక్కను దేని కోసమో తడువుకుంటుంది. "నాన్నా! నా చిన్ని తండ్రీ!" అని పలవరిస్తూ లేచి పోతుంది. నిద్రలేచి తన చిన్నితండ్రి కానరాకపోగానే వెక్కి వెక్కి యేడుస్తుంది ఆ కన్నె.

ఒకరాత్రి నడిరేయిని యిదే విధంగా ఆమె నిద్ర నుంచి లేచింది. "నాన్నా! నాచిన్ని తండ్రీ!" అంటూ కిటికీదగ్గరకు వెళ్ళి అవతలకు చూస్తూ "నాన్నా నాచిన్ని తండ్రీ!" అని కేక వేసింది. అవతల కటికచీకటి. బోరు మని వాన. ఆచీకట్లో ఆవానలో తన చిన్నితండ్రి...పొట్టిగా...లేతకాళ్ళతో నడుస్తూ...చిట్టి చేతులో చప్పట్లు చరుస్తూ...ముద్దు నోరుతో "అమ్మా!" అని పిలుస్తూ... వానలో తడిసిపోతూ జుట్టులోంచి నీళ్లు కారుతున్నా లక్ష్యపెట్టక అమ్మ దగ్గర "బాయి" తాగడం కోసం వొస్తున్న ట్లనిపించింది కాబోలు నామెకు. ఆమె కిటికీలోనుంచి బయటకు గెంతివేసింది. ఆమె తల్లిదండ్రులు ఆమెను లేవనెత్తి యింట్లోకి తీసుకువచ్చి పడుకోబెట్టారు. ఆరాత్రి ఆమెకు చాలా జ్వరం వచ్చింది. ఆజ్వరంలో "నాన్నా! నాచిన్ని తండ్రీ! ఇంత చీకట్లో యింత వానలో భయం వేస్తున్నా అమ్మకోస మని వొస్తున్నావా?" అని పలవరించింది ఆ కన్నె.

జ్వరం పోయింది.

ఆ పదిహేనేళ్ళ అమ్మాయి ప్రతిరోజూ సాయంత్రం వేళ సూర్యుడు వెళ్ళిపోయిన వెనక క్రమ్ముకునే మసక చీకట్లలో మెల్లమెల్లగా తడబడే అడుగులతో గంగానదీతీరానికి వొస్తుంది.

హిందీ-తెలుగు-కాంగ్రెసు-ఆంధ్రోద్యమం

(రాజా వత్సవాయి రాయజగపతి వర్మ గారు)

ప్రబుద్ధాంధ్రపత్రికలో హిందీని గురించి ఆదినుండి యు వ్రాయబడుచున్న విషయములు చేయబడుచున్న ప్రబోధము గమనింప నా కెంతో విషాదము కలుగుచున్నది. 'దేశభాషలందు తెలుగు లెస్స' అను కీర్తి నొందిన ఆంధ్రభాషను తమ బిడ్డలకు నేర్పుటమాని అఖిల నుండియు హిందీ నేర్ప బూనిన ఆంధ్రుల దాస్యజీవనమును విచారింపని ఆంధ్రు డుండబోడని నా నమ్మకము. వేలంవెర్రికి దాసానుదాసు లగు నేటి ఆంధ్రులలో గల లోపముల వెతుకుటయే మన పనిగ పెట్టుకొంటి మేని ఎన్ని యేని లోపముల జూపింపవచ్చును. అవ్యక్తతతో సంచరించు వారి తప్పిదములను వెల్లడించి మందలించి మన పని మనము చేసుకొనుట న్యాయము గాని వాదప్రస్తముగ వ్రాయుట ధర్మము కాదని పత్రికాధిపతులు గమనింప ప్రార్థన. ఇక హిందీ ఎంత వరకు అవసర మనునది కూడ ఆలోచింపవలసిన విషయము.

వివిధభాషలతోను వివిధజాతిమతభేదములతోను నిండి యున్న భారతదేశమునకు యిపుడు ఆంగ్లేయ పరిపాలనావిజృంభణ వలన ఇంగ్లీషు భాష రాజ భాష యైనటులనే కొంతకాలమునకయిన దేశమునకు స్వాతంత్ర్యము లభించునెడల ఏది యైన దేశ భాష రాజభాష కాదగిన అవసర మున్నది గాని లేకపోలేదు. మహమ్మదీయపరిపాలనలో హిందూస్తాని రాజభాష యై విలసిల్లుటవలన దానితో దగ్గర సంబంధము గల్గి మన ఆదిభాష యగు సంస్కృతపదమిళితమై యుండు హిందీకి రాజభాష అగుటకు ఎక్కువ వారసత్వ మున్న మాట వాస్తవము. అంత మాత్రముచేత దేశభాషలను వదిలి ప్రవర్తించుట మూర్ఖత. ఇంగ్లీషు రాజభాషగ నున్నంత మాత్రమున దానినే నేర్చుకొనవలెను గాని తెలుగును త్యజింపవలె ననుట ఎంత అవ్యక్తతయో కొంచము హెచ్చుతగ్గుగ ఇదియు అంత అవ్యక్తతయే. ఇంతకును దేశమునకు పారతంత్ర్యము పోయిన పిమ్మట కాదగిన విషయమున కిపుడు మాతృభాషను దూరమున నుంచుటకు ప్రయత్నించుట అవ్యక్తత అనవలయునో మూర్ఖత అనవలయునో మరే మన వలయునో ఆలోచించెదరు గాక! ఇట్టి అసందర్భపు దూరాలోచనలకు లోనై ఆంధ్రులు తమ పూర్వజ్ఞానమును గోల్పోయి కొట్లాటలతోను కబుర్లతోను పిరావేశములతోను కాలము వెళ్లబుచ్చుచుండుట జూచి తోడి జాతులు ఆంధ్రులను నీచముగ జూచుటలో వింత యే మున్నది?

ఇక నైన యీ అనవసరపు వాదప్రతివాదములకు చోటిచ్చుట మాని పత్రికాధిపతులు తమ విలువగల పత్రికలో ఆంధ్రాభ్యుదయమున కుపకరించు విషయములకు మాత్రమే తావీయవలె నని కోరుచున్నాను.

ఆంధ్రాభ్యుదయమునకు కాంగ్రెసు అడ్డు వచ్చినదనుట గాని "కాంగ్రెస్సు మనల్ని తొక్కేసింది. వుద్ధరించలేదు" అనుట గాని ముమ్మాటికిని అన్యాయము. ఏమంటారా? కాంగ్రెసు మన కోసం పుట్టలేదు. అది భారతదేశము యొక్క దాస్యవిముక్తి కోసం పుట్టింది. పెరిగింది. నెమ్మదినెమ్మదిగా పెంచాం! పెద్దదానిని చేశాం. పెద్ద దయిన తరువాత మన యిష్టం వచ్చినట్టూ వింటుందా? అనేకమార్పులు వచ్చాయి! రాక తప్పదు కాలచక్రం రోజురోజు మారిపోవుచున్నది. వాయువేగమనోవేగములతో మారిపోతున్నది. మారిపోవడం మంచిది కాదని నే నంగీకరింపను. పెరుగుట విరుగుట కొరకే! అయితే ఆంధ్రులు కాంగ్రెస్సుమహోద్యమంలో కాము మహోజ్వాలలలో పడిపోయి తమ అభ్యుదయాభివృద్ధులకు పాటుపడుట మరచిపోయిన

మాట వాస్తవం. యీదోషం ఆంధ్రులది లేదా ఆంధ్రనాయకులది గాని కాంగ్రెస్సుది కాదు కాంగ్రెస్సు దేశీయులలో ఎంతో ప్రబోధాన్ని కలిగించిది. జనసామాన్యములో ఎంతో కలకలమును లేవదీసింది. అంతే కాదు. స్వర్గాన్ని ఆచేతిలో ఓపీలకొది బ్రహ్మపర్యంతం ఆశ్చర్యపడేటట్టు, కన్పింపజేసింది! అయితే ఆస్వర్గం నిపుకగప్పిన నిప్పు అయిపోవుటకు కారకులం మనం గాని కాంగ్రెస్సు కాదు! కాదు!! కాదు!!!

కాబట్టి కాంగ్రెస్సులో పనిచేయవలసిన వారు త్యాగప్రధానులు, సర్వసంగపరిత్యాగులు. సన్యాసులు, గాని గృహస్థాశ్రమమున నుండి ఆలుబిడ్డలతో సంసారకాలక్షేపము చేసుకొనువారు ఆమహాసంస్థలో పనిచేయుట కిప్పట్లో తగరు. కాగా ఆంధ్రనాయకులలో చాలమంది తమ జాత్యభివృద్ధికి పూర్వము కంటె ఎక్కువ పట్టుదలతో, మంచి విశాలోద్దేశములతో, పని చేయగలుటకు తగిన సమయము వచ్చినది! ఇదివరకు కాంగ్రెస్సులోనైతే నేమి ఆంధ్రోద్యమంలో అయితే నేమి పేరుకోరకు, డాబుకోరకు, వాచాలత్వమును చూపుచు పనిచేసిన దేశద్రోహులు చాలమంది బయలుదేరి ఆంధ్రుల కప్రదిష్ట తెచ్చిపెట్టియున్నారు అట్టివారు మన కిపు డవసరము లేదు. మున్ముందెకిని వలదు.

మన కిపుడు కావలసినది మన జాత్యభివృద్ధి. వెంటనే మేల్కొని తోటి భారతజాతులతో సమానమైన స్థితికి మన ఆంధ్రజాతిని తీసుకు వచ్చుటే! ఇందుకు కర్తవ్య మేమి? మనోవాక్కాయ కర్మలతో జాత్యభివృద్ధికి పాటుబడు యువకులు, నాయకులు, కూడ మనలో గలరు. వారిపుడు తమ దృష్టి ఆంధ్రోద్యమములో పాల్గొనుటకు మార్చునటుల మనము ప్రయత్నింపవలెను. ఇందుకు పరదూషణతో నిమిత్తము లేని పత్రికలు మన కెంతో తోడ్పడగలవు. అంతే గాక కొందరు లక్ష్మీపుత్రులు ముందుకు రావలెను. అలక్ష్మీపుత్రులను ముందుకు రక్షింపగలిగిన వారు కార్యశూరులైన దరిద్రులగు యువకులు!

ఆంధ్రయువకులారా! లెండు, నడుములు బిగింపుడు! మీజాతి అధోగతి పాలగుచున్నది. మీరు మీజాతిని మేల్కొల్పి తగిన స్థితికి తీసుకురాదగిన సమర్థులు, ముందు మీజాత్యభివృద్ధి చూచుకొని పిమ్మట అఖిలభారతజాత్యభివృద్ధికి ప్రాకులాడవలెను గాని తనకు మాలిన ధర్మము మీకు తగదు. వెంటనే ఒక ఆంధ్రమహాసభను రాజమహేంద్రవరములోనో బెజవాడలోనో జరిపి తగిన కార్యక్రమమును నిర్ణయింపుడు. ఇందుకు మన దేశోద్ధారకాగ్రణులు తోడ్పడక మానరు. పిఠాపురం, వెంకటగిరి, బొబ్బిలి యువరాజులు, మోతే వారు, పైడా వారు, ముత్తావారు, నాళంవారు మున్నగు లక్ష్మీపుత్రులు, ఆంధ్రకేసరి వంటి కార్యనిపుణులు తప్పక ముందుకు రాగలరు. కావున జాగు సేయవల దని ఆంధ్రయువకుల నందరిని హెచ్చరించుచున్నాను.

కవులకూ వ్యాసకర్తలకూ విన్నపం

ప్రబుద్ధాంధ్రలో ప్రకటించడానికి ఎవరూ పద్యాలు పంపవద్దు. ఆంధ్రోద్యమమూ, చరిత్రా, సంఘాచారాలూ, మతాలూ, కళలూ, పరిశ్రమలూ, గొప్పవారి జీవితాలూ, ప్రపంచవృత్తమూ వగైరాలకు సంబంధించిన వ్యాసాలూ, కథలూ, ఏకాంకనాటకాలూ, విమర్శనాలూ వచనంలోనే కావాలి. ప్రకటించబడని రచనలు పోస్టుబిళ్లలు పంపినగాని తిరిగి పంపలేము. కర్తలకు వారిరచన పడిన సంచిక మొదలు ౧౨ సంచికలు పంపుతుంటాం. తరుచు రాసేవారికి ఎప్పుడూ పంపుతూ వుంటాము. రెవ్యూకోసం పుస్తకాలు పంపేవారు రెండేసి ప్రతులు పంపాలి. రెవ్యూలమీద పునర్విమర్శలు ప్రకటించము.

హిందీవల్ల తెనుక్కి జరుగుతూ వున్న అపకారం

హిందీవల్ల తెనుక్కి అపకారం జరుగుతోందన్నందుకు కినిసి, ఆవేశపరులై హిందీప్రచారకులు నేను రాయనివి రాసినట్టూ, చెప్పనివి చెప్పినట్టూ ప్రచారం చేస్తూ తమ వాదాన్ని బలపరుచుకుంటున్నారు.

౧ ప్రస్తుతం హిందీప్రచారం చేస్తూవున్న ఆంధ్రుల వల్ల జాతికి కళంకం కలుగుతోంది. హిందీవల్ల తెనుక్కి వల్లమాలిన అపకారం జరుగుతోంది. ఉత్కృష్టఫలాలు సాధించవలసిన ప్రజల శ్రద్ధాదీక్షలూ, ఆంధ్రవాఙ్మయానికి పుష్టి కలిగించవలసిన తెనుగువారి డబ్బూ వ్యర్థమై పోవడమే కాకుండా ప్రధాన విషయానికి యెసరు పెడుతున్నాయి.

౨. అనేక జాతులూ, అసంఖ్యభాషలూ కల హిందూదేశానికి వొక సామాన్యభాష అవసరమే. హిందీకి సామాన్యభాష కాదగిన అర్హత వుండడమూ నిజమే.

౩. కాని, "హిందూదేశానికి సామాన్యభాష యేది?" అనే విషయం యింకా పరిష్కారం కాలేదు. మాహమ్మదీయులు హిందీని అంగీకరించడం లేదు. అయితే సమయం వచ్చే దాకా వారి ప్రతిఘటనం మనకి స్పష్టంగా కనపడదు. వారు తమ శక్తి నంతా మరొక ప్రధానవిషయంమీద కేంద్రీకరించివున్నారు. నిజంగా సామాన్యభాష యేదో తేలవలసిన సమయంలో వారు భల్లూకప్పట్టు పడతారు. అప్పుడే ఏదో తేలుతుంది. ఇప్పుడు జరుగుతూ వున్న హిందీప్రచారం హిందూస్థానీలు తమ భాష కింకా మెజారిటీ సంపాదించుకోడానికి చేసేదే; గాని మరొకటి కాదు. నిజంగా మాహమ్మదీయులు తలుచుకుంటే యీ పరిస్థితుల్లో మన దేశంలో మెజారిటీ, మైనారిటీలను బట్టి యేవిషయమూ పరిష్కారం కాదు.

౪. అయినా హిందీప్రచారం యిప్పుడు జరుగుతూ వున్న విధంగా అవసరం లేదు. ఇంత యెత్తునా అక్కర్లేదు. ఇప్పుడంత అవసరమే పని లేదు.

ఇంతే.

సంపాదకుడు.

"మనమీదికి హిందీ దాడి వెడలిందన్నప్పటినుండి మీరు యెత్తిన జెండా ఆకాశాని కంటి, అన్ని దిశలను యెగురుతున్నది. భటు లందరు కళ్లు తెరిచారు. మీ ప్రయత్నాలకు తగిన ఫలితం తప్పకుండా వుంటుందని నా నమ్మకము. హిందీప్రచారకుల కృషి అంతా స్వార్థముతో కూడుకొన్నది కాని హిందీమీద ప్రేమ వుండి గాదని తెనుగునాడు గ్రహించింది. ముందు యిలా జరుగుతుందని గ్రహించాడు కాబోలు, మహానుభావుడు "ఆంధ్రరత్నము" ఆంధ్రాన్ని గూర్చి వ్రాస్తూ "గాంధి కోమటి వచ్చి హిందీ నేర్పించి, బందెలో బెట్టింప........" అని అన్నాడు.

కర్ణపాలెం కృష్ణారావు.

భారతజాతీయతకి భారతీయు లంతా ఒక్క భాష మాట్లాడడం అవసర మనిన్నీ యిదివరకే యెక్కువ మంది మాట్లాడుతూన్న హిందీనే వ్యవహారభాష చెయ్యడం సులభ మనిన్నీ చాలామంది అంగీకరించిన సంగతే. ఈ విషయంలో గాంధి మహాత్ముడు కూడా పట్టుదల చెయ్యడంవల్ల మరింత తీవ్రంగా యీప్రచారం సాగుతూంది. దీనికీ అంతా సంతోషించవలసిందే.

కాని హిందీప్రచారం అతివ్యాప్తి పొందుతూ ఆంధ్రభాషకి అడ్డం వస్తూందని ప్రబుద్ధాంధ్రపత్రిక ఘోష చేస్తూంది. ప్రబుద్ధాంధ్ర సంపాదకులు కూడా హిందీభాష అందరికీ తెలియడం అవసరమే నని ఒప్పుకోకపోరు. అయితే హిందీ నేర్చుకునే

వారిలో చాలామంది తెలుగు నేర్చుకోవడం లేదనిన్నీ హిందీమీద చూపేటంత మక్కువైనా తెనుగుమీద చూపడం లేదనిన్నీ అందువల్ల తెనుగుకి అపకారం జరుగుతూందనిన్నీ ఆపత్రికవారి అభిప్రాయమని నేననుకుంటూను.

అయితే నిజంగా హిందీప్రచారంవల్ల తెలుగుకి నష్టం కలుగుతూందా? హిందీప్రచారకులు తప్పుతోవలలో పడ్డారా? ఇప్పటి పద్ధతులతోనే యింకా కొంతకాలం హిందీప్రచారం సాగినట్టయితే తెలుగుభాషకి తీరని నష్టం కలుగుతుందా? ఈసంగతులన్నీ ఆలోచించవలసివుంది. అందరికి హిందీ తెలియడం అవసరమన్న విషయంలో తగువే లేదు కనుక ఎక్కువ బాధ లేదు. హిందీప్రచారంలో తప్పుదారులుంటే మంచి దారికి మళ్ళించడానికి ప్రయత్నించవచ్చు. శాంతంతోటీ దూరదృష్టితోటీ పని చేస్తే యీ తగువు సులభంగానే తీరిపోతుంది. కాని ప్రబుద్ధాంధ్రవారికి హిందీప్రచారమంటేనే యిష్టం లేదని ప్రచారకులున్నూ హిందీప్రచారకులంతా తెలుగుకి శత్రువులే అయిపోతున్నారని ప్రబుద్ధాంధ్రవారున్నూ ఆవేశపడి పని చేస్తే యిద్దరి కోరికలూ నెరవేరవు. కలతలకి కారణాలవుతాయి. దానివల్ల దేశానికి గొప్ప నష్టం రావడానికి అడ్డం లేదు.

ఆంధ్రులంటే ఆవేశపరులని వ్యగ్రోత్సాహులని అర్థం చెప్పవచ్చు అంత హెచ్చుగావుంటుంది. కనుక దూరదృష్టి వుండదని వేరే చెప్పక్కర్లేదు కదా! ఒకప్పుడు ఇంగిలీషే దేశభాషగా మారితే బాగుంటుందని కొందరు నాయకులనుకొనేవారు అభిప్రాయపడ్డారు. అందులో ప్రసిద్ధికెక్కిన హరిసర్వోత్తమరావుగారు తెలుగువారిలో ముఖ్యులు. అప్పుడు వారు ఆంధ్రపత్రికకు ప్రధాన సంపాదకులుగా వుండేవారు కూడాను. అప్పుడు వారు తమ బంగారపు కలంతో రత్నాల భావాలలో యింగ్లీషు భాషే వ్యవహారభాషా యింటి భాషా కూడా అయితే గాని మన దేశానికి ముక్తి లేదని గట్టిగా నొక్కి వ్రాశారు. భగవంతుడి దయవల్ల ఆవెర్రి. చాలామందికి యెక్కలేదు. ఆయన ఉద్యోగాంతముతో ఆగొడవ కూడా అంతమైపోయింది.

ఇంగ్లీషు రాజభాష అవడంచేత దానితో కోర్టులలోనూ కచ్చేరీలలోనూ అవసరం కలిగింది. ముఖ్యముగా గవర్నమెంటు ఉద్యోగాలు జీవనోపాధులుగా కొంతకాలం వుండడంచేత చాలామంది ఆవ్యామోహంలో పడి యింగ్లీషు నేర్చుకున్నారు. ఉద్యోగాలు అవసరం లేని కొద్దిమంది వ్యవహారాలకి గౌరవాలకీ నేర్చుకున్నారు. ఉద్యోగలబ్ధి లేకపోయినా యిప్పుడు కూడా చాలామంది ఆడియాసలతో నేర్చుకుంటూన్నారు. కొత్తగా యింగ్లీషు నేర్చుకోవడం ఆరంభించిన మొదటి రోజులలో కొంత కాలం బాగానే నడిచింది వ్యవహారం. అంతకంతకు వారి సంఖ్య యెక్కువ కాగానే ఆట్టివారంతా ఒక శాఖగా మారిపోయారు. క్రమంగా వారికి తెనుగంటే రోత పుట్టింది. ఇంగిలీషు రాని చుట్టాలకయినా తెలుగులో వుత్తరాలు వ్రాయడమూ, తెలుగు పుస్తకాలు చదవడమూ తెలుగు పత్రికలు చూడడమూ చివరకి తల్లితోటీ పెళ్ళాము పిల్లలతోటీ కూడా తెలుగు మాట్లాడడమూ తెనుగువారితో కలిసి మెలిసి వుండడమూ చిన్నతనంగా కనిపించి తమ సంఘముతో తమామూ వేరైపోవడం తటస్థించింది. తమ దేశీయులకు వారు క్రమముగా చేరి చూడరాని వింతవారైనారు. ఈలాగు జనాభా లెక్కలలో చదువుకున్న వారని చెప్పబడే చాలామంది తెలుగు దేశానికీ తెలుగు బాసకూ కొరగాని వారైపోయినారు. ఇందువల్ల తెలుగుకి యెంత నష్టం వచ్చిందీ లెక్క వెయ్యడానికి యెవరికి తరమవుతుంది? తెలుగు జనసంఖ్యకంటె మించని జనసంఖ్యమాత్రమే గల బంగాళీభాషా పత్రికలలో దినపత్రికలలో కూడా ౨౦, ౩౦, ౪౦ వేల మంది చందాదారులు గల పత్రికలుండగా

ఆదేశంలో యింగ్లీషు చదువుకొన్న విద్యావంతులలో వేలకొలది మంది స్వభాషలో దినదినమూ దేశోపయోగకరము లైన గ్రంథాలు వ్రాసీ పత్రికలకు విజ్ఞానప్రదము లైన వ్యాసాలు వ్రాసి భాషకూ దేశానికీ తోడ్పడుతూ వుండగా ఆభాషలో జాతీయభావాలతో నిండిన పుస్తకాలు వేలకొలది నిత్యమూ బయలుదేరుతూ లక్షలకొలది ప్రతులు ఖర్చుపడుతూ ప్రజలను విజ్ఞానసంపన్నులుగానూ దేశాభిమానులుగానూ మార్చుతూ వుండగా రెండు వేలకు మించిన చందాదార్లు గల పత్రికలు గాని సంవత్సరములో వెయ్యిప్రతులు విక్రయం కాగల పాటి భాగ్య మైనా పట్టిన పుస్తకాలు గాని తెలుగులో వుండక పోవడానికి కారణ మేమిటి? ఇంతటి అరిష్టానికీ ఇంతటి మహోపద్రవానికీ యింగ్లీషు నేర్చుకున్న మన ప్రబుద్ధులే హేతు వని తెలుసుకున్నప్పుడు ఏకొత్తభాష న్నా ఆంధ్రులు భయపడడం సహజమే అనుకుంటాను. అదీ సహజధోరణిలో ఆక్రమణం చెయ్యకపోవడం పరీక్షయకారణం అవడం కూడా సహజమే అనుకుంటాను.

అయితే హిందీప్రచారం కూడా యింగ్లీషు లాగే ఆంధ్రభాషాభివృద్ధిని అరికట్టే లాగు వుందా? అట్టి చిహ్నా లేమైనా కనపడుతూన్నాయా? అని ఆలోచించి చూడవలసి వుంది. ఇప్పుడు హిందీ నేర్చుకుంటూన్నవా రంతా ఏకభాషావ్యవహారం అవసరమని గ్రహించి దేశాభివృద్ధి నే లక్ష్యంలో వుంచుకుని దేశాభిమానంతోటే నేర్చుకుంటూన్నారా అంటే లేదని గట్టిగా చెప్పవచ్చును. స్వరాజ్యావశ్యమాన్ని గురించి అదివరకే తెలుసుకున్నవారూ స్వరాజ్యం కోసరం అదివరకే పాటుపడుతూన్న వారూ వీరిలో లేనే లే రని కాదు. అట్టి వారు చాలా కొద్ది మంది వున్నా రనీ తక్కిన వారిలో ఎక్కువ మంది సరదా కనీ కొంతమంది నలుగురితోటి పాటూ వుండడాని కనీ నేర్చుకుంటూన్నా రంటే నిజానికి దగ్గర కాక పోదు. హిందీ నేర్చుకునే వారిలో దేశవిషయాలు తెలుసుకునే వారూ దేశాభిమానం గలవారు ఖద్దరు కట్టేవారు లేక పోయినా యేవిధంగా నైనా సరే దేశోపయోగానికి శక్తి కొద్దీ పాటుపడేవారు ఎంద రుంటారో చూతామని లెక్క వేసే వారికి సంపూర్తిగా ఆశాభంగం అయి తీరుతుంది. అన్నిటికంటే తెలుగు కూడా నేర్చుకుందా మనుకునే వారు కాని తెనుగు నేర్చి హిందీ నేర్చుకోవడమే ధర్మ మనుకునేవారు గాని ఎంద రున్నా రన్న మాట తలపెట్టుకున్న వారికి తలవంపు తప్పదు. ఇదివరకు ఇంగిలీషు తెనుగును బాగా కుంగదీసింది. ఇప్పుడు హిందీ చదివే వారికి అంటే వారిలో చాలామందికి అనగా నూటికి సగం మందికి పైగా తెనుగంటే అభిమానం లేదు. వారు తెనుగు వార్తా పత్రికలు చూడరు. తెనుగు పుస్తకాలు చదవరు. వారికి తెలుగు పుస్తకాలు తెలియవు. దాని తియ్యదనమూ దాని మెత్తదనమూ దాని జాణతనమూ తెలుసుకుని ఆనందించగల మహాభాగ్యము పాపము! వారికి ప్రాప్తము లేదు! కాని వారివల్ల తెలుగు పొందవలసిన పుష్టి పొందడం లేదు. దానికి కలగవలసిన ఫలం కలగడం లేదు. తెనుగుతల్లి తన కన్న బిడ్డలు తన పట్ల చూపే నిరాదరణం చూచీ తన పిల్లల పామరత్వము చూచీ సిగ్గుపడుతూంది. విచారిస్తూంది. సంతాపపడుతూంది. పయి సంగతులు తెలుసుకున్న వారికి హిందీవల్ల కూడా తెలుగుకి దెబ్బ తగులుతూంది అని తోచడం తప్పు కాదు. తెలుగును గట్టిగా ప్రేమించే వారు హిందీ అంటే భయపడడం కూడా అసహజం కాదు.

అయితే ఏవుద్దేశ్యంతో నేర్చుకుంటే యేమి? ఎవరు నేర్చుకుంటే యేమి? ఏమీ నేర్చుకోకుండా వృథాగా వుండేవారు హిందీ అయినా నేర్చుకోవడం మంచిదే కాదా? వారివల్ల తెలుగు కేమి అడ్డం వస్తుంది? వారు అసలు తెనుగు చదవని వారే కదా! తెనుగు మీద అభిమానం లేని వారే కదా! తెలుగుపత్రికలకీ పుస్తకాలకీ వారివల్ల అప్పు

రోడ్డుపక్కన

పి. గణపతిశాస్త్రి

రోడ్డుపక్కన చింత, ఎగిరే
ఎర్రకంకర కెర్రబారింది;
గుడ్డపేలిక లల్లె కొంగలు
కునికిపడినవి చింతకొమ్మల్లో.

మండువేసవిఎండ మిటమిట
మండినది; ఆ మిట్టమధ్యాహ్నం
మెతుకుల్లే ఎండకాంతులు
మెరిసెనీడల్లో.'

మేకపిల్లలు సగము కన్నులు
మూసి నెమరులు వేసెను;
చెవికొనల చినిచిన్నినీడలు
చెదరినవి మెలమెల్లగా.

కుడితిగోలెం కొసను నిలిచీ
కావుకావని కాకి కూసింది;
కొమ్మసందున ఉండి ఉండే,
కొంగ నిద్దర కూత కూసింది.

పిట్టగోడను పట్టిపోయే
పిల్లినాలిక మూతి తుడిచింది:
తొండతన మెడయెత్తి మరిమరి
తొంగిచూచిం దూరికే.

ఇళ్లు గుడిసెలు ఎండధాటికి
కళ్లుమూసిన వేళలో,
కూరమున కంసాలిపిట్టే
ఊరిలో కంసాలిసుత్తికి,
మారుమోగింది.

చింకిపాతల తల్లిఒడిలో
చింతనీడను చిన్నిపాపే,
చించుకొని ఏడ్చేటిపాపే,
పోరుపట్టింది.

పిల్లయేడిచి యేడ్చి పాపం
తల్లికన్నుల వేడికన్నీరే,
అప్పుడప్పుడు తాగి కొంచెం
చప్పరించేది.

కడుపు ఆకలి మంటతోనే
కంది కనలిన కళ్లతోనే
ఏడ్చియేడ్చిన శోషతోనే
నిదరపోయేది.

మనిషిపతే రాజ్యమందే,
మనిషిపెంచిన చింతకిందే,
మనిషిశిశువే కడుపుచిచ్చుకు
మాడి ఏడ్చింది.

* * *

తొట్టెలో బాబు

జనమంచి కామేశ్వరరావు

ఎదలపొంగే
వలపుకోర్కుల,
ద్రచ్చితీసిన
మిసిమివో!

నిశలో, శశిలో
కొసరి వెలిగే,
ప్రేమ కళికల
ప్రమిదవో!

ఉవిద ఊర్పుల
ఉజ్జ్వలించిన
ఉడుగణమ్ముల
మొలకవో!

* * *

వెన్నెల విరిసిన
కలువ బోదలో
గానము పోసిన
భ్రమరికవో!

ఆజన్మాంతపు
అనుబంధమ్ముల
రాగోజ్జ్వల ఫల
భూమికవో!

తారాకోమలి
రతిలో జారిన
విగళితమాలా
కుసుమమవో!

చంద్రుని భాస్వ
దీప్తి వెలార్చిన
శీతల మయూఖ
నాళమవో!

ప్రారంభ జీవిత
ప్రాతః క్షణము నాడు,
ఆనాడు నా మర్మ
మందు త్రచ్చిన మంట,
ఆనాడు నాభావ
మందు విచ్చిన వంట,
ఈనాడు మధుమాల !
ఈనాడు మధుకీల !

*	*	*

బాల్యజీవన లీల !
ప్రౌఢ భావజ్వాల !
వ్యథలలో సుధలొ, సం
పదలలో దైన్యమ్మొ,
విధుర జీవితములో
నిదురించు నాశలో
కదలించి, గాలించి,
కరుణామయ మొనర్చి,
కరగించి, కవన సా
గర గర్భము విదిల్చి
పరిమళించిన మాల !
పరిణమించిన కీల !
మేలుకో, అమృతార్ద్ర
హాలాహల జ్వాల !
పలుకో, మధుకీల !
నాగుప్త హృద్వేల !

*	*	*

అజ్ఞాత జీవనీ !
అవ్యక్త భావనీ !

అంతరంగాల యా
భ్యంతర జ్వాలినీ !

ప్రేయసీ ! ప్రేమిక
నీరహ స్తంత్రికల
మధుకీలి కాంగుళుల
విధుర వీణాగణము
హృదయ తృష్ణోజ్జ్వలము !
మృదుల రాగావిలము !
మధురమ్ము ! మార్దవము !
పృథుల విశ్వోత్సవము !

హేసుధార్ణవబాల !
హేసుప్త మధుకీల !
మేలుకో, మేలుకో,
ఈనవో దయవేళ !
ఏలుకో, ఏలుకో,
నాగుప్త హృద్వేల !
హే దీప్త మధుకీల !
లీలా ప్రణయహేల !

*
* *

ద్దూ యిప్పుడూ కూడా లాభం లేనే లేదు కదా! దీని కింత రభస చెయ్యడం యెందుకూ? అని కొంతమంది అడగవచ్చును. ఈప్రశ్న పైకి బాగానే కనపడుతుంది. ఈసంగతి నిజం లాగే తోస్తుంది. కాని ఆలోచించి చూస్తే దీన్నికూడా స్వభాషాభిమానీ స్వదేశాభిమానీ అయిన తెనుగువాడు సహించవలసిందీ ఉపేక్షించవలసిందీ కూడా కాదు.

ఏమంటారా! తెనుగు బాసలో ప్రవేశం లేని వారికీ దాని ఘనందు తెలియని వారికీ దాని గొప్పతనమూ దాని సౌకుమార్యమూ దాని సౌందర్యమూ దాని సారస్యమూ తెలవక పోవడం చేత దాని మీద ఎన్నటికీ వారికి మక్కువ పుట్టదు. మోజు కలగదు. అభిమానం వుండదు. అందువల్ల తమ సంతానానికీ తమఅదుపాజ్ఞలలో వున్న వారికీ తమసలహాలు వినే వారికి తమ చుట్టపక్కాలకీ తమ చుట్టుపక్కాల వారికీ కూడా హిందీ నేర్చుకోమని చెప్పడం నేర్పించడం తప్ప తల్లిభాషమీద శ్రద్ధ తీసుకోవడం తటస్థింపదు. అందువల్ల అట్టి వారి యిళ్లు క్రమంగా హిందీలోగిళ్లే అయిపోతాయి. అప్పుడు వారి యిళ్లు తెలుగుబాసకి యెడవయి పోతాయి. కొన్నాళ్లకి స్వభాషయిన తెనుగు పరాయిభాషగా మారిపోతుం దంటే ఆశ్చర్యపడవలసిన పని లేదు. ఇది భవిష్యత్తులో మాట గాని యిప్పటిది కాదు గనుక వేళాకోళపు మాటగా కనపడుతుంది.

ఇంకో సంగతి. తెలుగులో బాగా ప్రవేశం లేని వారు గాని తెలుగులో పాండిత్యం లేని వారు గ్గాని హిందీలో గాని యితరభాషలలో గాని పండితులూ కవులూ గ్రంథకర్తలూ కాగూడదా అల్లా అవడం తప్పా? అంటే అట్టివారు స్వభాషలో కృషి చేసి కృతార్థులు కాలేక యితరభాషలలో సులభంగా ప్రవేశం పొందగలిగితే అందులో పాండిత్యం సంపాదించడం తప్పు లేదు గాని భీష్మించినట్టూ, తెనుగు నేను చదవనే చదవను అని ఒట్టు పెట్టుకున్నట్టూ స్వభాషను అంటరానివా రని తన వారినే అలుసుగా చూస్తూన్నట్టు చూడడం ఆరంభిస్తే అది గొప్ప తప్పే అవుతుంది. అంటరాని వారని దూరంగా తోసివేసిన వారిని దగ్గరికి చేరదీస్తేనే గాని గతి లేదని పశ్చాత్తాపపడుతూన్నట్టు స్వభాషను ప్రేమిస్తేనే గాని మోక్షం లేదని తెలుసుకుని పరితాపపడే రోజులు తెలుగువారికి రాకపోవు.

మరో మాట! హిందీప్రచారకులు కూడా ముఖ్యంగా గమనించ దగ్గది. ఏమిటంటే? హిందీప్రచారకులలో గాని హిందీ వుపాధ్యాయులలో గాని పెక్కుమందికి అంటే నూటికి తొంభై మందికి పైగా తెలుగులో తగిన ప్రవేశం లేదు. అందువల్ల ప్రచారం కూడా సరిగా జరగ దని ఇది హిందీ అభివృద్ధికి అడ్డంకి అని నిజం కప్పిపుచ్చ లేని అనుభవజ్ఞు లంతా ఒప్పుకునే సంగతే. చాలమంది యింగ్లీషు పండితులు తెలుగులో ప్రవేశం లేకపోవడం చేత శిష్యులకు బాగా తెలిసేటట్టు చెప్పడం చేత కాక పోవడమూ శిష్యులు తెలిసిన దానితోటే సంతుష్టి పొందడమూ అనేకచోట్ల చూస్తూన్నాము. అల్లాగే హిందీప్రచారకులు కూడా తాము తమ భాషలో ప్రవేశం లేని వారవడంవల్ల కొన్నికొన్ని ఘట్టాలలో సరిగా అర్థం చెప్పలేకపోవడమూ నిఘంటు చూచినా తెలియకపోవడమూ, కూడా కలుగుతూంది. కాబట్టి హిందీప్రచారం బాగా సాగవలెనన్నా తెలుగువారు ముందుగా తెలుగు

నేర్చుకోవడం అవసరం అని తేలుతూంది. పరభాషయిన (ఇక్కడ పరభాషంటే యిదివరకు పరిచయం లేని భాషా కొత్త భాషా అని మా అభిప్రాయం గాని వ్యవహారభాషగా దేశమంతా వ్యాపింపకలసిం దని నమ్మిన హిందీని పరాయిదానిగానూ అగత్యం లేని దానిగానూ భావించి చెప్పడం కాదు) హిందీ నేర్చుకోవడంలో గల దీక్షలో పదోవంతు దీక్ష వుంటే మాతృభాషైన తెలుగు హిందీకంటె పదిరెట్లు త్వరగా పట్టుపడుతుంది. హిందీ నేర్చుకుంటూన్నా రంటే వచ్చే గౌరవం తెలుగు కూడా నేర్చుకుంటూన్నా రంటే తగ్గిపోదు. తెలుగు సంస్కృతాలవలె తెలుగు హిందీలు నేర్చుకుని ఉభయ భాషాప్రవీణు లనిపించుకోవడం గౌరవం మాత్రమే కాకుండా ఉభయతారకం కూడా అవుతుంది గనుక హిందీవిద్యార్థు లయిన ఆంధ్రు లంతా తెలుగు ముఖ్యంగా నేర్చుకుని తమ భాషాజననికి న్యాయం చేసి ఆశీస్సులు పొందడం ధర్మ మని హెచ్చరిస్తూన్నాను.

ఇక్కడ, ప్రచారకుల ముఖ్యధర్మం అవశ్యకరణీయం కూడా ఒకటి వున్నది. అది యేమంటే! ఇదివరకు తెలుగు రానివారు అనగా తెలుగుబాసలో అక్షరజ్ఞానం లేనివారూ తెలుగంటే సరదా లేనివారూ దాని మీద మక్కువ లేనివారూ హిందీ నేర్చుకోవడానికి వస్తే చెప్పకుంటారా వద్దంటారా? తెనుగు కూడా చదువుకో మంటే వారు వినకపోతే ఏమి చేసేది? అని వూరుకోక వారికి తెలుగులో అభిరుచి పుట్టించడానికి శక్తికొద్దీ ప్రయత్నించాలి.

దేశభాష లన్నింటిలోనూ తెలుగు బాస వృద్ధమైనది మధుర మైనది. అంద మైనది. దీనిని అనేక భాషలు తెలిసిన పండితులు చాలామంది సిద్ధాంతం చేశారు. దేశభాష లందు తెలుగు లెస్స అని ఆంధ్రవిష్ణు కథలలో చెప్పినట్టు సంస్కృత కర్ణాట ఆంధ్రాది అనేక భాషలలో గొప్పపండితుడై కవియై గ్రంథరచయితయైన కృష్ణదేవరాయలే గొంతెత్తి చెప్పినాడు. తూర్పుఖండములలోని భాషలలో కెల్ల ఇటాలియను బాస వంటిది తెలుగని అనేకభాషల రుచులు గ్రహించిన పాశ్చాత్యపండితు లుద్ఘోషిస్తున్నారు. తెలుగంత మధుర మైన భాష వేరొకటి లేదు. తెలుగుదేశంలో పుట్టి తెలుగుసుధను తాగక పోవడం కంటె దురదృష్టమూ దౌర్భాగ్యము లేదు. అయ్యో! సోదరులారా! తెలుగుతల్లిని ప్రేమించి ఆమెను సేవించి పూజించి ధన్యులు కండు అని బోధించి మరల్చుడు!

తెనుగుబాసను నేర్చుకొనుడు తెనుగు రుచిని గ్రహించుడు అని తెనుగు బిడ్డలకు నేటికి బోధించవలసిన దుర్గతి కలిగినది గదా అని వాపోవుచు మిన్నకుండక హిందీప్రచారకులకూ అభ్యాసకులకూ యితరులకూ కూడా తెనుగుయొక్క గొప్పతనము తెలిసేటట్టు తెలుగుపత్రికల ద్వారానూ హిందీ పత్రికల ద్వారానూ గూడా ప్రబోధించి తెలుగు వెలుగుచే కన్నులు మిరుమిట్లు గొలిపి దాని తేజస్సును చూచి నివ్వెరపడి లోక మెల్ల దాసోహమనునట్లు కృషి చేయుదురు గాక యని ప్రబుద్ధాంధ్రవారిని కూడా కోరుతున్నాడు. స్వస్తి!

—మంగిపూడి వేంకటశర్మ.

మా మిత్రు లగు మారేమండ రామారావుగారు "ప్రబుద్ధాంధ్ర" సెప్టెంబరు సంచికయందు పై శాసనమును ప్రకటించియున్నారు. వారి వ్రాతను బట్టి చూడ నీశాసనమును గురించి యిదివరకు వారికి తెలియనటుల కాన్పించుచున్నది. కాని యీమధురపూడి శాసనము యొక్క మూలము కలనల్ మెకంజీ దొరవారిచే సంపాదింపబడి సి. పి. బ్రౌను దొరవారిచే పునరుద్ధరింపబడిన స్థానికచరిత్రలయందుండి చరిత్రకారు లనేకులకు తెలిసియే యున్నది.

రామారావుగారు వ్రాసినట్లు శాసన మందున్న పదునారు పంక్తులును తెలుగు భాషలో లేవు. ఇందలి మొదటి మూడున్నర పంక్తులును సంస్కృత శ్లోకరూపకముగను, మిగిలిన పన్నెండున్నర పంక్తులను తెలుగు వచనమందును ఉండి, శాసన మంతయు తెలుగు లిపియందును చెక్కబడి యున్నది.

పైశాసనమున చెప్పబడిన దానమును, కాటయ వేముడు శా. శ. ౧౩౨౭ తారణసంవత్సర పుష్య శుద్ధ దశమీ గురువారమునాడు చేసి యుండె నని శ్రీరామారావుగారు వ్రాసి యున్నారు. ఇది తప్పు. శా. శ. ౧౩౨౭ తారణపుష్య శుద్ధ దశమి పైశాసనమున చెప్పబడి యున్న ప్రకారము మకరసంక్రమణపుణ్యదినము కాదు. పుష్యబహుళదశమినాడు మకరసంక్రమణమై యున్నది. స్థానికచరిత్రలయందుదాహృత మైన మధురపూడి శాసనమందు "స్వస్తిశ్రీ శకవరుషంబులు ౧౩౨౭ అగు నేంటి తారణ సంవత్సర పుష్య బ ౧౦ గు నేంటి మకరసంక్రాంతి పుణ్యకాల"ము నందు అని యున్నది. ఇదియే సరియైన పాఠము కాని రామారావుగా రిచ్చిన పాఠము కాదు. శాసనమందు "సు" అని శ్రీరామారావుగా రిచ్చిన యక్షరము "బ" అని చదువుకొనవలెను. ఈ విషయమందే గాక వీరు వేరొక విషయమున గూడ పొరబడిరి. శా. శ. ౧౩౨౭ తారణ సంవత్సర పుష్యశుద్ధ దశమీ గురువారము క్రీ. శ. ౧౪౦౫ వ సంవత్సరము మార్చి ౧౬ వ తేది యగుచున్న దని గుణించిరి. ఇది తప్పు. శా. శ. ౧౩౨౭ తారణ పుష్యశుద్ధ దశమీ శనివారమునకు సరియగు హ్యాణామానము క్రీ. శ. ౧౪౦౪ వ సంవత్సరము డిశంబరు ౧౩ వ తేదీ యగుచున్నది గాని రామారావుగా రనునటుల క్రీ. శ. ౧౪౦౫ వ సంవత్సరము మార్చి ౧౬ వ తేదీ యగుట లేదు. మన శాసనకాలము శుద్ధ దశమి కాక బహుళ దశమి యగుటచే క్రీ. శ. ౧౪౦౪ సంవత్సరము డిశంబరు ౨౩ వ తేదీ యగుచున్నది.

ఈశాసనమువలన కొన్ని సమస్య లేర్పడుచున్న వని రామారావుగారు వ్రాసి యున్నారు. క్రీ. శ. ౧౪౦౫ నాటికి కుమారగిరిరెడ్డి జీవించి యుండెనా యనున దొకటి యుట! గౌతమీతీరమున నున్న వేదాద్రి యెద్ది యనునది రెండవ సమస్య యట! కొండకు సమీపమందున్న మధురపూడిని కాటయవేము డెట్లు దానము చేసె ననునది మూడవ సమస్య యట! ఈశాసనమువలననే యీసమస్య లేర్పడలేదు. ఈవిషయము లిదివరకే చర్చింపబడినవి. అయినను ఇందలి మొదటి సమస్య విషయమై రామారావుగారు "యీశాసనకాలమగు క్రీ. శ. ౧౪౦౫ వరకును అనగా పెదకోమటి వేముని రెండవ రాజ్యసంవత్సరమునకూడ కుమారగిరిరెడ్డి జీవించియుండె" నని యొక విపరీత సిద్ధాంతమును చేసి, యద్దానిని సమర్థించుకొనుటకై ఎన్నియో యసందర్భపు పనులను చేసి యున్నారు. అందు మొదటిది "కుమారగిరి జీవించియుండగనే యతనిని రాజ్యచ్యుతుని జేసి పెద్దకోమటివేముడు కొండవీటి సింహాసనము నధిష్టించె నని శ్రీయుత చిలుకూరి వీరభద్రరావుగా రభిప్రాయపడియున్నా రని యసత్య మాడుట. చరిత్రచతురాననులును, పరమపూజ్యులును అగు శ్రీవీరభద్రరావుగారు వ్రాయని వ్రాతలను సృష్టించి వారి పేరున ప్రజ

అను మోసగింప సాహసించినందులకు రామా రావుగారి ధైర్యము నెంతయు గొనియాడవలసి యున్నది. శ్రీవీరభద్రరావుగారు తమ యాంధ్రు ల చరిత్ర మూడవభాగమందు ౧౯౩ పుటయందు పై జెప్పిన యభిప్రాయమును వెల్లడించినటుల రామారావుగారు వ్రాయుచున్నారు. కాని ఆపుట యందలి ప్రతి యక్షరమును నేను చూచియున్నను శ్రీవీరభద్రరావుగారు పైయభిప్రాయమును వెలి బుచ్చినటుల కాన్పించలేదు. సరి గదా, ఆగ్రంథ మందే ౧౯౭ పుటయందు "కుమారగిరిరెడ్డి కొక కుమారరత్న ముండినను, ప్రోలయమాచారెడ్డి మను మడు పెదకోమటి వేమభూపాలుడు, సింహాసనా రూఢు డగుటయు, కాటయవేమారెడ్డికిని పెదకో మటివేమభూపాలునకును మనస్పర్ధ గలుగుటయుఁ జూడ కోమటివేమభూపాలుడు కొండవీటిరాజ్య మును బలాత్కారముగా గ్రహించె నని విశ్వసింప వలసి వచ్చుచున్నది." అని జీవించియున్న కుమార గిరిరెడ్డి దగ్గరనుండి గాక యాతని పుత్రుని యొద్ద నుండి కోమటివేమారెడ్డి రాజ్యమును గ్రహించి యుండు నని శ్రీవీరభద్రరావుగా రభిప్రాయపడి యున్నారు. మరియు "కుమారగిరిరెడ్డిభూపాలుడు క్రీ. శ. ౧౪౦౦ వఱకును బరిపాలనము చేసి యున్నట్లు గన్పట్టుచున్నది. ఇతనితో వేముని వంశ మంతరించినట్లు గన్పట్టుచున్నది. కుమారగిరిరెడ్డి కొక కుమారు డున్నట్లొకటి రెండు శాసనములవలన దెలియవచ్చినను అతని యనంతరము పెదతాత మనుమడు కోమటివేమారెడ్డి ప్రభుత్వభారము వహించెను." అని ౧౯౩వ పుటయందును, "కుమారగిరిరెడ్డి యనంతర మక్రమముగాఁ బెద కోమటివేమభూపాలుడు కొండవీటి రాజ్యము నాక్రమించెను" అని ౨౫౧వ పుటయందును, "కుమారగిరిరెడ్డి మరణానంతరము అనపోతరెడ్డి రాజ్యమును బొందవలసినవాడై యుండగా పెద కోమటివేమారెడ్డిరాజ్య మాక్రమించుకొని పరిపాల నము చేసినట్లు గానంబడుచున్నది" అనియు, "కొండవీటి సామ్రాజ్యము కుమారగిరి మరణముతో రెండుగా జీలిపోయిన దనుట వాస్తవము" అనియు శ్రీవీరభద్రరావుగారు తమ "శ్రీనాధకవి" అను గ్రంథమందును కుమారగిరిరెడ్డి మరణానంతరమే పెదకోమటివేముడు రాజ్యమునకు వచ్చె నని స్పష్టముగా వ్రాసియుండగా రామారావుగారు కల్పితవ్రాతలు వ్రాసి చరిత్రకారుల కండ్లయందు దుమ్ముగొట్ట జూచుట మిక్కిలి శోచనీయము. సుప్రసిద్ధ చరిత్రకారుని వ్రాతల నిష్టము వచ్చినట్లు మార్చుట అతి సాహసము.

రామారావుగారి సాహస మింతతో నాగ లేదు. బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి "శృంగారశ్రీనాధ" మను గ్రంథమందలి ౬౧ పుట నుండి "కుమారగిరి ౧౪౦౩ వరకు రాజ్య మేలెను." అని ఉదాహరించి యున్నారు. నిజమునకు ప్రభా కరశాస్త్రిగా రా పుటయందు "కొమరగిరి క్రీ. ౧౪౦౦, ౧౪౦౩ వరకు రాజ్య మేలెను" అని వ్రాసియున్నారు. తమ యసంబద్ధ వ్యాఖ్యానమును సమర్ధించుకొనుటకు పైవాక్యమందలి "౧౪౦౦" అను సంఖ్యను రామారావుగారు దిగమ్రింగిరి. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు తమ గ్రంథమును రచించు సమయమున కుమారగిరి రాజ్యము చేసిన యాఖరు సంవత్సరము క్రీ. శ. ౧౪౦౦ యైనను, లేక క్రీ. శ. ౧౪౦౩ అయిన నైయుండు నని సందియమును వెలి బుచ్చిరే గాని క్రీ. శ. ౧౪౦౩ అని నిశ్చయముగ చెప్పలేదు. మరియు "కుమారగిరి చనిపోయిన తరవాతనే పెదకోమటి వేమారెడ్డి రాజ్యమునకు వచ్చెను గాని అతడు జీవించియుండగా మాత్రము కాదు" అని యీమధ్య చెన్నపురియందు శ్రీప్రభా కరశాస్త్రిగారు నాతో చెప్పి యున్నారు.

ఇంకొక చిత్ర మేమనగా క్రీ. శ. ౧౪౦౪ లో కుమారగిరి మరణించియుండినచో మరుసటి సంవత్స

రము కాటయవేముడు కుమారగిరిని తన "స్వామి" యని పేర్కొని యతని కక్షయసుకృతముగా మధురపూడిని దానము చేయుట పొసగనేరదట! ఆహా! చరిత్రపరిశోధకు లగు రామారావుగారి పోకడ లెట్లున్నవో చూచితిరా! కుమారగిరి మరణానంతర మాతని కాటయవేముడు తన "స్వామి" యని పేర్కొనకూడదా? ఇటులే శాస్త్రముం దున్నది? మరణించిన వాని కక్షయసుకృతముగా దానము చేయుట పొసగదా? పొసగదని రామారావుగారి దయచే చరిత్రపరిశోధకు లిక తెలిసికొన వలయును గాబోలు. ఎవరి కక్షయసుకృతముగా దాన మిచ్చెదరో రామారావుగారికసైన సరిగా తెలిసికొని వ్రాసెదరు గాక! క్రీ. శ. ౧౪౧౦ లో కూడ కాటయవేముడు కుమారగిరిరెడ్డి కక్షయసుకృతముగా కలువచేరు అను గ్రామమును కుమారగిరిపురమను పేరుతో దానము చేయలేదా? రామారావుగారి యూహప్రకారము కుమారగిరిరెడ్డి యప్పటివరకు జీవించి యున్నట్టులేనా? కాని పై కలువచేరు గ్రామమును దానము చేసినట్టుచెప్పుచున్న అహోబలశాసనమందే కాటయవేమున కొక కుమారగిరి యను పుత్రు డున్నట్లును, మరణించిన కుమారగిరిరెడ్డి యొక్క అపరావతారమే యాకుమారగిరి యనియు చెప్పుచున్నదే!

ఇవి యన్నియు వీరి యూహాలు. ఈయూహలకు కారణము కుమారగిరిరెడ్డి పెదకోమటి వేమారెడ్డి రాజ్యమునకు వచ్చిన తరువాత కూడ జీవించి యుండె నని విపరీతసిద్ధాంతమును చేయుట కొరకే! చరిత్రవిషయములను చక్కగా పరిశీలించి విమర్శించువారెవరును వీరివలె అవిశ్వాసమునకు పాత్రులు కాజాలరు.

మరియు కుమారగిరిరెడ్డి జీవించియుండగనే కోమటి వేమారెడ్డి యాతని రాజ్యచ్యుతుని జేసి రాజ్య మాక్రమించినపుడు కాటయవేము డేమి చేయుచుండెనో రామారావుగారు చెప్పి యుండ లేదు. ఎవని ప్రాపు చూచుకొని కుమారగిరిరెడ్డి రాజ్యనిర్వహణభార మంతయు విడచిపుచ్చి వసంతోత్సవాది భోగముల దేలియాడుచుండెనో, ఎవడు బంధువై, మంత్రియై, సేనానియై కొండవీటి రెడ్డి రాజ్యలక్ష్మిని తన యవక్రపరాక్రమముచేత పరుల హస్తగతము గాకుండ రక్షించెనో అట్టి కాటయవేముడు కుమారగిరి రాజ్యచ్యుతు డగుట చూచుచు చేతులు నలుపుకొనుచు కూర్చుండి యుండెనా? పోనీ, రాజ్యచ్యుతు డైన తన స్వామికి తన రాజ్యమున నివసించుట కింత యాశ్రయ మైన నిచ్చి యుండడా? అందుల కేదేని నిదర్శన మున్నదా? లేక కోమటివేముడు రాజ్యమును బలాత్కారముగా గ్రహించెననుటకు ప్రమాణ మేమైన గలదా? లేదే! అట్టిచో రామారావుగారిట్టి విపరీతసిద్ధాంతమును చేయు టెందులకో!

ఇక రెండవ సమస్య వేదాద్రి యెద్ది? అని. "కమలాద్రియు, వేదాద్రియు, పుష్పగిరియు రాజమహేంద్రపురములో తీరస్థములై యున్న మిట్టలకు నామములు" అని శ్రీయుత చిలుకూరి వీరభద్రరావుగారును, పై యభిప్రాయముతో నేకీభవించుచు శ్రీయుత ప్రభాకరశాస్త్రిగారు ఎన్నియో సంవత్సరములకు పూర్వమే నిర్ణయించి యుండ మధురపూడిశాసనము-వలన నీసమస్య యెందుల కేర్పడవలెనో, అర్థమగుట లేదు. మరియు శ్రీభావరాజు వెంకట కృష్ణరావు గారు ఆంధ్రేతిహాసపరిశోధకమండలి పత్రికయందు రాజమహేంద్రవరచరిత్ర వ్రాయుచు నీకమలాద్రి, వేదాద్రి, పుష్పగిరి మున్నగువానిని గూర్చి ఆంగ్లమున వ్రాసిన వ్రాతను చిలుకపలికినటుల తెలుగున వ్రాయుచు నీ సందర్భమున శ్రీకృష్ణరావుగారి పేరైన నెత్తక స్వంతభావములవలె వ్యాసమున వ్రాయుట మిక్కిలి శోచనీయము.

ఇక మూడవ సమస్య. కొరుకొండలో నాయకవంశీయులు రాజ్యము చేయుచుండగా మధురపూడి నెట్లు దానము చేసె నని. రెండవ ముమ్మడి నాయ

కుడు కోరుకొండలో క్రీ. శ. ౧౩౯౫ వరకును రాజ్యము చేసెనని వట్టుపై కాటయ వేమారెడ్డి యీ రాజ్యము నాక్రమించి కోరుకొండ దుర్గములో కొంత సైన్యము నుంచెననియు, రామారావుగారే వ్రాయునట్లు, కోరుకొండ కైఫీయతు వేయి నోళ్ల ఘోషించుచుండ క్రీ. శ. ౧౪౦౪ లో వేసిన మధురపూడిశాసనమును గురించి ఎందులకీ సమస్య యేర్పడవలెనో తెలియుట లేదు.

—గుండవుపేడి జానకిరామయ్య
బి. ఏ. (ఆనర్సు)

సెప్టెంబరు ప్రబుద్ధాంధ్ర సంచికలోని శ్రీమారేమండ రామారావుగారి మధురపూడి శాసనము అనే వ్యాసంలో కొంచెం సందేహాలు కలగడంచేత తన్నివృత్తికోసం నా అభిప్రాయాన్ని వ్రాస్తున్నాను. శాసనములో "స్వస్తిశ్రీ శకవరుషంబులు ౧౩౨౬ అగు నేంటి తారణసంవత్సర పుష్య శు ౧౦గు నాంటి మకరసంక్రాంతి పుణ్యకాలమందూను" అని ఉంది. దీనికి సరియైన యింగ్లీషు తేదీగా ౧౫–౩–౧౪౦౫ శ్రీరామారావుగారిచ్చినారు. ఇది పొరబాటున పడినట్లు తోస్తుంది. ఆరోజులలో మేషరాశికి రవి రావడం మార్చి ౨౬ వ తేదీని జరుగుచుండేడిది. దానిని బట్టి చూస్తే మార్చి ౧౫వ తేదీ మీనమాసంలో పడింది గాని ఆరోజున మకరసంక్రాంతి కాలేను. ౧౩౨౬ శకసంవత్సరం పుష్య శు ౧౦ నాడు ౧౪౦౪ క్రీస్తు శకసంవత్సరం డిశంబరు ౧౧వ తేదీ లక్ష్మివారం అవుతుందని తోస్తుంది. స్వామికన్నుపిళ్లే గారి ఇండియన్ క్రొనాలజీ ఆసంవత్సరం మార్గశిర బ౩౦ డిశెంబరు ౨ వ తేదీ మంగళవారము నాడు పడినట్టు చెప్తుంది. అయితే పుష్య శు ౧౦ లక్ష్మివారం నాడు మకరసంక్రాంతి అయి యుంటుందా అని. ఆరోజుల్లో డిశెంబరు ౨౫,౨౬ తేదీలలో మకర సంక్రాంతి అవుతూ వుండేది. కాబట్టి లక్ష్మివారానికి సరిపోయేట్లు ౨౫–౧౨–౧౪౦౪ తీసుకున్నట్లయితే ఆరోజున పుష్య బ ౧౦ అవుటకు అవకాశం వుంది. అలా గయితే శాసనములోని "సు౧౦గు" అన్నది "బ౧౦గు" అనడానికి బదులు తప్పుగా అచ్చు పడ్డాదేమో అనిపిస్తుంది. "మకర సంక్రాంతి పుణ్యకాలమందూను" అన్న యిన్ని అక్షరాలు పొరబాటుపడ్డాయన్న కన్న "సు" కి బదులు "బ" అని యున్నాదేమో అనడం సుబబుగా తోస్తుంది. అదీ కాక దానధర్మాలు చేయడానికి ఉత్తరాయణప్రవేశపుణ్యకాలం చాలా తగి ఉంటుంది కూడాను.

మరి యొక చిన్న సందేహం. కుమారగిరిరెడ్డి మరణించిన తరవాతనే అతని ఆత్మశాంతి కొరకు "అక్షయసుకృతంబు లవునట్టుగాను" కాటయరెడ్డి, వేమారెడ్డి యీ మధురపూడిని కుమారగిరిరెడ్డి నామ మాచంద్రార్కస్థాయిగా ఉండేటందుకు కుమారగిరిపుర మను పేరుతో శ్రీకరదానం చేసి యుండవచ్చును. ఎవరైనా మృతులైతే ౧౨ రోజులు అయిన తర్వాత దానాలు ధర్మాలు చెయ్యడం ఆచారం ఉంది. ఇలా ఊహించినట్లయితే కుమారగిరిరెడ్డి ౧౪౦౪ డిశెంబరులోనో, అంతకు ముందో మరణించి యుండునని సందేహించవలసివస్తుంది. చారిత్రకులు విమర్శించి నిర్ణయింప ప్రార్థితులు.

—శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి
బి. ఏ.

ఆంధ్రగద్య వాఙ్మయము

మండలపర్తి ఉపేంద్రశర్మగారు

ఏవాఙ్మయమునం దైనను తొలుదొల్త పద్యగ్రంథములును తర్వాత గద్యగ్రంథములును పుట్టును, ధారణానుకూల్యము మెండుగా నుండు నని కాబోలు ప్రప్రథమమున పద్యగ్రంథములే బయలుదేరు చుండును.

వ్రాత వ్రాయు పద్ధతి అంతగా తెలియని కాలమునుండియు జనసామాన్యమందు పదములు, పాటలు అనేకములు ప్రసిద్ధములు ఈయవి ఆ దేశీముల జాతీయతను తేటదెల్లము జేయును. ఈ గీతములు ముగ్ధగ్రామ్యపదమయములై పాండిత్యాపేక్ష అంతగా లేనివై అజాతీయులను ఆనందాబ్ధి నోలలాడించునవై యుండును. పద్యములు ముందు పుట్టుట తర్వాత గద్యము లుద్భవించుట అను విషయము ప్రతిభాషయందును కలదు. ప్రాచీనభాష లైన సంస్కృతము నందును గ్రీకుభాషయందును తొల్త పద్యకావ్యములు తర్వాత గద్యకావ్యములు కల్గిన వనుటకు "రామాయణము" "ఇలియడ్" మొదలైన పద్యగ్రంథములే సాక్ష్యము. ఈ గ్రంథకర్త లైన వాల్మీకి హోమరులు ప్రాచీనులు. వాటి కన్న ప్రాచీనములు వేదములు. అవియును ఛందోబద్ధములే యగుట ప్రసిద్ధము.

దేవభాష యగు సంస్కృతము నందు వలెనే ఆంధ్రమునందును పద్యగ్రంథములే ముందు బయలుదేరినది. ప్రాఙ్నన్నయ యుగమున జాతీయఛందోబద్ధము లగు గేయములే బహుళప్రచారమున నున్నట్లు పాల్కురికి సోమనాథుడు పేర్కొన్న తుమ్మెద పదములు, ప్రభాతపదములు, పర్వతపదములు, ఆనందపదములు, వెన్నెల పదములు, మున్నగు వాని వలన తెలియవచ్చుచున్నవి. ఆకాలమున జాను తెనుగు "ఉరుతరపద్యగద్యోక్తుల కంటె సరసమై సర్వసామాన్యమై" యుండె నని సోమనాథుడు తన బసవపురాణమున చెప్పుకొని యున్నాడు. ఈపదములే అభివృద్ధి జెంది పద్యములుగా మారియుండును. కాని తెనుగు కవులు సంస్కృత బహుళము లైన రచనలను గావించి జాను తెనుగును సన్నగిల చేసిరి. మీదు మిక్కిలి సంస్కృత ఛందస్సుమీదను, తత్సమభాషమీదను, మక్కువ గలవారై దేశీయేతివృత్తములను, దేశీయ ఛందస్సులను దేశభాషను, తెనుగుకవులు, తెరచాటున నుంచిరి.

పద్యమునకు గల ప్రాధాన్యము గద్యమునకు లేకుండినను వాఙ్మయమున పూర్వమునుండియు దీనికిని స్థానము గలదు. ౧౧వ శతాబ్దమునకు పూర్వపు శాసనములందు కొన్నిటిలో గద్యములు కన్పట్టుచున్నవి. శాసనములు దానపట్టా లనియు, వానికి వాఙ్మయమునందు స్థానము పూజ్య మనియు కొందఱు వానిని 'త్రోసిరా' జనిరి.' సంస్కృతమునందు భోజుని కాలమందు చంపువు లుద్భవించినవి. అతడే తన పేర నొక రామాయణచంపువును వెలయించి యున్నాడు. ఆదికవి యైన నన్నపార్యుడును, భోజుని సమకాలికు డగుటచే భోజుని మతము ననుసరించి భారతమును చంపుకావ్యముగా రచించి యున్నాడు. కనుక గద్యమునకును నన్నపార్యుడే ఆద్యు డనియు వచనరచన మనకు అప్పటి నుండియు నుండిన దనియు ఎన్న నగును. వచనరచనలు మన చంపుకావ్యములం దుండుటచే మనవారు ప్రత్యేకముగా గద్యగ్రంథములను వెలయించుటకు పూని యుండలేదు. కాని ప్రత్యేకము గద్యమయము లైన కావ్యములు పన్నెండో శతాబ్దమున ప్రభవించినట్లు తెలియుచున్నది. వానిని శైవకవులు వెలయించిరి.

భావావేశము వర్ణించుటకు పద్యములను, వస్తువివరణాదికమునందు, గద్యములను ఉపయోగించి మొదట ఆంధ్రకవులు కావ్యములను వ్రాసినట్లు తోచుచున్నది. కాని రానురాను ధారణానుకూల్యము కొఱకో గొప్పకో ఆంధ్రులు గణితశాస్త్రము ఛందశ్శాస్త్రము మొదలగు వానిని సహితము పద్యమయములుగనే వ్రాసిరి.

శబ్దశాసనుడు పేర్లపట్టిక నిచ్చుచోట కథనసందర్భమున స్వల్పవర్ణనలందును శాస్త్రీయప్రసంగముల పట్ల వచనమును వాడెను. చిన్నచిన్న సంవాదముల యందు సహితము సులభసంస్కృతపదములై ధారాచమత్కారములై వెలసిన వచనరచనలను వ్రాసియుండెను. ఈతని రచనలే చిన్నయసూరి మొదలైన వారికి మేలుబంతులై ఒప్పినవి.

తిక్కన సోమయాజి వచనరచనలు ప్రౌఢములై పద్యములవలె నడచుచుండును. ఈతని కాలమందును పద్యములపై ఎక్కువ వ్యామోహము ఉన్నదనుటకు మూలమున గద్యమం దున్న దండి దశకుమారచరిత్రను కేతన పద్యరూపమున వ్రాయుటయే నిదర్శనము.

ఎఱ్ఱాప్రెగడ సరళములును సంస్కృతపదసుందరములును అగు వచనములను, పోతన దీర్ఘములును శ్లేషానుప్రాణితాలంకారములతో గూడిన వానిని శ్రీనాథుడు సుందరములును కోమలపదవిన్యాసములును అయి ఒప్పు వచనరచనలను, తమతమ కావ్యములందు జొప్పించి, ఆంధ్రవాఙ్మయమునందు గద్యగ్రంథములు అంతగా లేవను ప్రథను పోగొట్టియున్నారు.

పదునేనవ శతాబ్దారంభమున నుండియు ప్రత్యేక గద్యకృతులు బహుళముగా ప్రచారములోనికి వచ్చినవి. పదునాఱవ శతాబ్దమునం దనేకగద్యగ్రంథము లాంధ్రవాఙ్మయమున నుండినట్లు మనకు తెలియును. వానిలో ప్రధానములు ఏకామ్రనాథకవి వ్రాసిన ప్రతాపచరిత్రము విశ్వనాథనాయకుని స్థానాధిపతి వ్రాసిన రాయవాచకము మొదలయినవి.

పదునేనవ శతాబ్దమందు కళువె వీరరాజు వచనభారతమును రచించెను. ఇందు బిగువుగల రచనములు అనేకములు. ఈతనికి నిండుసున్నలతో గూడిన పదములం దెక్కువ ప్రీతి. భాష కొంత వ్యావహారికము. వీరరాజు కుమారుడు నంజరాజు వచనమున భగవద్గీతను, హాలాస్యమహాత్మ్యమును శివభక్తవిలాసము మున్నగు గ్రంథములను వ్రాసెను. ఈశతాబ్దముననే విజయరంగ చొక్కనాథుడు శ్రీరంగ మహాత్మ్యమును, మాఘమాహాత్మ్యమును వ్యావహారికభాషయందు వ్రాసెను. సముఖము వెంకటకృష్ణప్పనాయకమణి జైమిని భారతమును, సారంగధరచరిత్ర, మొదలైన గ్రంథములను రచించెను. ఇతని రచనలందు వాక్యావసానములు తక్కువ. రెండు మూడు పుటల కొక్క వాక్యముండును. అరసున్నకు తఱచుగా నిండుసున్నయే యుండును. ఇప్పటికే అనేక కథల పుస్తకములు మొదలైనవి వచనమున వెలువడియుండెను.

పందొమ్మిదో శతాబ్దిని పరవస్తు చిన్నయసూరి నీతిచంద్రికను, తాను వ్రాసిన వ్యాకృతికి లక్ష్యముగా వచనమున రచించెను. వీరి తరువాత కోలాశేషాచలకవి, ముదిగొండ బ్రహ్మయలింగారాధ్యకవి కొన్ని గద్యగ్రంథములను వ్రాసిరి.

వీరేశలింగంపంతులుగారు నీతిచంద్రికకు ఉత్తరభాగమును కొక్కొండ వెంకటరత్నంపంతులుగారు, కోరాడ రామచంద్రశాస్త్రిగారు మొదలగు వారు పంచతంత్ర హితోపదేశములనుండి కొన్ని భాగములను చిన్నయసూరికి తర్వాత తెనిగించిరి.

ఆంధ్రమునందు విమర్శనలకు దారి చూపినవారు శ్రీ పూండ్ల రామకృష్ణయ్యగారు, వీరు తమ పత్రికయైన అముద్రితగ్రంథచింతామణి యందు పెక్కు విమర్శనలను వ్రాసి "ఆంధ్ర డ్రైడను" అన నొప్పి

వారు. కొక్కొండ వేంకటరత్నంపంతులుగారును భాషాసంజీవని పత్రికను నిర్వహించి వాఙ్మయ విషయములను ప్రచురించియుండిరి. తరువాత సులభమైన భాషలో కవిజీవితములను వ్రాసి భాషాసేవ చేసిన వారు శ్రీ గురుజాడ శ్రీరామమూర్తిపంతులు గారు. తరువాత ఆంధ్ర కవుల చరిత్ర నిర్దుష్టముగ వ్రాసి ఆంధ్రలోకమునకు అర్పించిన వారు వీరేశలింగంపంతులుగారు వీరు, గద్యమున కవుల చరిత్రనే గాక స్వీయచరిత్రలను వ్యాసవాఙ్మయమును నవలలను వెలయించి 'గద్యతిక్కన' అను బిరుదు నందిరి. వీరికన్న మున్ను "శ్రీరంగరాజు చరిత్ర" అను పేరుగల వచనప్రబంధమును వెలయించి తెనుగు తోటలో నవలాంకురమును నాటినవారు నరహరి గోపాలకృష్ణమ్మశెట్టిగారు.

హేమలత, అహల్యాబాయి మున్నగు నవలలను వ్రాసి శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు మొదలయిన పలువురాంధ్ర రచయితలు వచనకావ్యములను వ్యాసములను వెలయించుచు, భాషాయోష నలంకరించుచున్నారు.

వచనరచనవలననే గాని భాష అభివృద్ధినందజాలదనియు మనుజులు జ్ఞానయుక్తులు కాజాలరనియు, శాస్త్రములు విరివిగా వ్యాపింపజాలవనియు గ్రహించినవారరుదు. అన్యభాషల నుండి విషయములు సంగ్రహించి వానిని దేశములో వ్యాప్తము చేయుటకు సాధనమైనది వచనమే! మన దేశమునందు చదివినవారు అల్పసంఖ్యాకులు. వారి కడకే రసజ్ఞులును, కవులును, పండితులు, తమ జ్ఞానజ్యోతిని తేవలయును గాని జనసామాన్యము కడ కరుగజాలరు. వచనరచనముల ద్వారా వారిని విద్యావంతుల నొనర్పవచ్చును. అట్టి రచనములు సరళములై యుండవలెను. సరళము లగు ఉత్తమవచనగ్రంథము లింకను బయలుదేరుట అవశ్యకమై యున్నది. అట్టి కొఱతను తీర్చుటకు బుద్ధిమంతులు యత్నించి దేశము నుద్ధరించి వాఙ్మయమునకు వైభవము నాపాదింతురు గాక!

దసరా విసవిసలు

పూడిపెద్ది వేంకటరమణయ్యగారు

పదేళ్ళ క్రిందటి దాకా అవోలా గుండేవి దసరా సందళ్ళు. ఇప్పుడోలా గున్నాయి దసరా సరదాలు. అప్పుడు చెమ్కీ పనులు చేసిన ముఖమలు దుస్తులూ, చెవులకు మద్దికాయలూ చేతుల్లో రంగుల బాణాలూ, జేబులలో విడ్డ పూవులూ, చిన్నారి పెదవులలో శ్రీమద్రామాయణమో చిన్ని గోపాలపదాలో దసరావరసలతో, ధీమాగా కొంతసేపూ, దడదడా కొంతసేపూ, చదువుతూ, సరసులైన బిడ్డల తండ్రులపై పూలబాణాలు వేస్తూ తమ ఆయుధాలకు నివేదన లిమ్మంటూ పప్పుబెల్లా లిమ్మంటూ తమ్ము విద్యావంతులుగా చేసినగురువులకు కట్నా లిమ్మంటూ, అదే పాటగా అదే ఆటగా, గ్రామం అంతా కలకలా విరిసే చిన్న బొట్టెల సందడితో పలు పలుకులు పలుకుతూ ఉండేది. ఎక్కడ విన్నా చిటుక్కు చిటుక్కు మన్న బాణాల చప్పుడులే. ఎక్కడ విన్నా పవి

పాపం పాటలే. ఎక్కడ విన్నా జయజయధ్వానాలే. ఇవి ఆశ్వీజశుద్ధపాడ్యమి మొదలు విజయదశమిదాకా వినిపించేవి.

అప్పుడాపిల్లల ఆట పాటలువిని ఆనందించిన తలిదండ్రుల హృదయాలు హృదయాలు. ఆబిడ్డల చురుకుదనం ప్రదర్శించి చొక్కిపోయిన గురువుల హృదయాలు హృదయాలు. బాలుర శిక్షలో స్వేచ్ఛ—వినోదంలో విద్య—అడకువలో ఆట! ఏమి సందడి! ఏమి సరదా! క్రొత్త జిలా! క్రొత్త కళా! అప్పుడు చిన్నపిల్లలకు అక్షరాభ్యాసం చేసి, ఆరవతరగతి వరకూ చదువు చెప్పిన బడిపంతులే ఆబాలుర విషయమయి సర్వబాధ్యతలూ వహించేవాడు. ఆచదువు పునాదిమీదనే సబుజడ్జీ, సాహిత్యచక్రవర్తీ కూడా నిలబడేవారు. బడి పంతులు జీవితం బాగుండేది. వానికి గ్రామంలో చాలా గౌరవముండేది.

క్రమక్రమంగా మన విద్యాధనం బోర్డుఖజానాలలో పడిపోయింది. ప్రెసిడెంట్లకు క్రొత్త పెత్తనాలు వచ్చేయి. బడిపంతుళ్ళ నోళ్ళకు తాళాలు పడ్డాయి. "మీకు తెలిసిన విద్య పిల్లలకు నేర్పడానికి వీలు లేదు; మా సూత్రాల మీదనే వైర్యార్కు చేయండ"న్నారు అందుకు పంతుళ్ళు ఒడబడ్డారు. "మీరు సంవత్సరమంతా చెప్పిన చదువును క్షణంలో తక్కెడ పెట్టి తూచేసి దానికి తగిన గ్రాంటిస్తా"మన్నారు గవర్నమెంటువారు. "మాకు నచ్చే చదువు చెపితేనే మీబడిని బడిగా అంగీకరిస్తా"మన్నారు. అన్నిటికీ తల యూచేడా గురువు. గురువులకు గురువీ బోర్డు. పులిమీద పుట్ర. ఇంతవరకూ బాగుందండి. ఇలాంటి కంట్రోలులో ఏవేనా కొన్ని లాభాలుంటాయేమో దానితో ఇప్పుడు మనకు తగవు లేదు.

మున్ముందీ దసరాసరదాలకు గవర్నమెంటు బళ్ళలో కట్టడి చేసేరు. వారి పదచిహ్నితలో బోయేరు బోర్డువారు. ఇది ఆపీవలసిందని నల్లచుక్కల రెక్కలు గల తెల్లపావురాలలా గెగిరేయి ఎగరవూ మరి? యుద్ధపు రోజులలో పావురాల వార్త తెగిరే యట కాదూ? ఇదీ యుద్ధసన్నాహమే. యూనిఫారములూ, ఆయుధధారణమూ, వ్యూహనిర్మాణమూ, బాణప్రయోగమూ, వీరపురుషస్మరణమూ ఇవే గదా బాలురకు నేర్పేవి దసరాలో వాని నట్లు బాహాటంగా నేర్పరాదు. ఇక నేముంది! కళ అంతా బోర్డువారి కలంమొనలో నిమిడిపోయింది. బాలుర దసరా సరదాలు భయంకరణరంగాలుగా తోచేయి కాబోలు. లైసెన్సు లేందే ఆయుధధారణకు వీలు లేదు కాబోలు. పోనీ అలాటి యేర్పాటేదేనా ఉంటే పిల్లలముద్దూ ముచ్చటకూ కూడ లైసెన్సు కట్టుకుంటారు తలిదండ్రులు ఈ అవకాశ మేనా కలుగజేయండని బోర్డువారిని ప్రార్థించవలసి ఉంది మనం.

ఎప్పుడయినా సరే ఆడుపిల్ల మగాడికంటె గడుసుదీ. గవర్నమెంటు గర్ల్సుస్కూళ్లలో దసరా ఆంక్ష మొదలు పెట్టింది. చాలాకాలం క్రిందటనే. పిల్లలు తల్లులతో చెప్పుకొని యేడ్చేరు. "ఏంచెకమ్మా నీకొ తిరగడం, బాణాలు విరవడమూను? సత్యభామ లాగు సంగ్రామానికి వెళతావా యేమిటి? ఏదో విధంగా కళను పోషించరాదూ? భావికళల సౌభాగ్యం బాలికల చేతుల్లో ఉంది. నేను నీకో ఉపాయం చెబుతాను విను. చిత్రకళ ఉందే అది మీకు తెలిసినట్టు మగపిల్లలకు తెలీదు. బొమ్మలతో మీ రాడుకున్నట్టు వాళ్ళాడుకోలేరు. అలాటి వాళ్ళందరకూ చిత్రకళోపాసన శిల్పకళోపాసన కనబాచు మన దేశంలో ఇప్పుడిప్పుడు చిత్రనిర్మాణకౌశలం చిగురిస్తూంది. ఈ సమయంలో నీవు దానిని హెచ్చరించి ఆయా ప్రతి

శ్రీ నరహరితీర్థులు.

మారేమండ రామారావుగారు య్యం. ఏ. బి యిడి

దక్షిణహిందూదేశ శాసనసంపుటములలోని శ్రీ కూర్మసింహాచలశాసనములలో గొన్నిటినుండి క్రీ. శ. ౧౩, ౧౪ శతాబ్దములలో కళింగ దేశమున వైష్ణవ మతము వ్యాపించినవిధము తెలియనగుచున్నది. ఈ మతమును ప్రచారముచేసిన వారిలో శ్రీ నరసింహభారతి మున్నగు శ్రీవైష్ణవ గురువులును, శ్రీనరహరి తీర్థులను మాధ్వగురువును ముఖ్యులు.

శ్రీయుత రాళ్ళబండి సుబ్బారావు ఎం. ఏ. ఎల్. టి. గారు తమ "కళింగదేశచరిత్ర" పుట. ౧౯౧. లో 'నరహరితీర్థులు: కళింగము' అను శీర్షక క్రింద వ్రాయుచు శక. ౧౧౫౨ నరసింహ మహామునిని నరసింహభారతిని నరహరితీర్థులను సించుశాసనములను పేర్కొనినారు. పైగ్రం ౯౨ పుటలో "పైశాసనములనుబట్టి, ఈ ధ్వగురుపరంపర కళింగదేశమున వైష్ణవ వ్యాపింపజేసినట్లు తెలియుచున్నది" అని పిమ్మట నరసింహమహాముని, నరహరి న్నాథతీర్థులు, వాసుదేవభారతి, రాఘవ గారి నామములు చెప్పబడినవి. ఇవే యభిప్రాయములు J. A. H. R.S VIII–i pp. ౭౧–౮౩. లోని వారి వ్యాసమునను గాంచనగుచున్నవి. ఇందువలన ౧ నరహరితీర్థులును నరసింహభారతియు నొక్కరే ౨ పై వైష్ణవగురువులందరును మాధ్వులు ౩ క్రీ. శ. ౧౨౩౦ నుండియు నరసింహమునిచే మధ్వ మతము ప్రచారము చేయబడెను. అను నూహలు గలుగుచున్నవి.

ఈయూహలు సమంజసములు కావు. నరసింహభారతియు, నరహరితీర్థులు నొక్కరుకారు. మొదటివారు శ్రీరామానుజాచార్యులవారి సాంప్రదాయములోని శ్రీవైష్ణవగురువులు. శ్రీనరహరితీర్థులు ద్వైతగురువులు శ్రీమధ్వాచార్యులవారి ప్రత్యక్ష శిష్యులు. ద్వైతగురువులకు 'భారతి' యను బిరుదముండదు. ద్వైతగురుపరంపరలో నెచ్చటను శ్రీ సుబ్బారావుగారు పేర్కొనిన నరసింహభారతిమున్నగువారి ప్రశంస లేదు. అట్లే క్రీ. శ. ౧౨౩౦ నుండి ద్వైతమతప్రచారము జరగెననుటయు సరికాదు. ఆమతమును స్థాపించిన శ్రీమధ్వాచార్యులవారే క్రీ. శ. ౧౨౩౮ లో జన్మించిరి.

వాస్తవమేమన, క్రీ. శ. ౧౨౩౦ నుండియు శ్రీవైష్ణవగురువులు కొందరు కళింగదేశమున శ్రీ రామానుజులమతమును వ్యాపింపజేయుచుండిరి. శ్రీమధ్వాచార్యులవారివలన ద్వైతసిద్ధాంతమును తెలిసికొని శ్రీనరహరితీర్థులు క్రీ. శ. ౧౨౬౪–౯౩ నడుమ దాని నీదేశమున ప్రచారముజేసిరి. ఈరెండు మతములకును విశేషసామ్యముండుటచే నన్యోన్య సాహాయ్యముతో నుభయమతగురువులును వైష్ణవ మతమును వృద్ధిచేసిరి. పండితు లీవిషయమును గమనింతురుగాక!

మలనూ పటాలనూ సేకరించి నియింటనే చిత్రకళా ప్రదర్శనం చెయ్యి. తోడి బాలిక లందరనూ ఈ దసరాదినాలలో పిలచి పప్పు బెల్లా లిచ్చి కళాతత్వం బోధపరచు. నృత్యగీతాలతో ఆకళాదేవత నారాధించు. ఇది మంచి పనేనా? బాగుందా? మనోజ్ఞకళకు తోడ్పడుతున్నావా? మరి యేడు ...ఖ్యా! కన్ని రొత్తనుకో!" అంది ఆతల్లి, కన్నతల్లి.

సరే. బాగుంది ఆడుపిల్ల, కవ్వల పరికిణీ, పువ్వుల లాల్చీ మిలమిలా మెరసే కళ్ళూ తళతళా మెరిసే నగలూ, చేతిలో కుంకుమభరిణా, చెప్పబుతూంది కళాతత్వం తోడి బాలికలకు.

ఇక అమ్మక చిక్కిన మేక మగపిల్లవా డలా నిలబడిపోయాడు. బాణం లేదూ—గానం లేదూ—ప్రతిమా లేదూ—పాటా లేదు. దసరా అంతా విసవిసలతో నింపేస్తున్నాడు.

తల్లిదండ్రులు లిక నీ కుఱ్ఱలకొరకేదీనా కళావ్యాప్తి కనిపెట్టవలసి ఉంది కాదూ దసరాలో!

వ్యాఖ్యానములు

సింహావలోకనం

మళ్లీ ప్రారంభించాక ప్రబుద్ధాంధ్రకు ఈసంచికతో వొక సంపుటమూ, యీ నెలతో వొక సంవత్సరమూపూర్తి అయినాయి.

"తెనుగు దేశంలో తెనుగువారికి తెనుగు జాతిని మళ్లీ నిర్మించుకోడానికి తగిన కార్యక్రమం యేమీ లేదు. తెనుగు జాతిని నడిపించగల తెనుగు రాయుడు లేడు". ఈపన్నిండు మాసాల అనుభవం వల్లా "అవునా, కాదా?" అని వూగులాడుతూ వుండిన నా యీ నిశ్చయం దృఢపడింది.

మన ప్రముఖులకు చురుకు పుట్టాలంటే యితర వరగణాల నుంచి తాఖీదులు రావాలి. మన యువతులూ, యువకులూ నడుములు బిగించి ముందుకి వుర్కితే అంటే మన ప్రముఖులకు అజ్ఞలు సాయించే వారు తప్పకుండా పైవారై వుండాలి.

ప్రస్తుతస్థితి యిదీ.

పెద్ద కబుర్లు చెబితే లాభం లేదు. ఇలాంటి ఆవేదనతో, ఇది పోగొట్టా లన్న ఆవేశంతో పని చేసేవారు వేలకొద్దీ తయారయితే గాని యీజాతికి మళ్లీ నామరూపాలు కలగవు.

ప్రబుద్ధాంధ్ర చిన్న పత్రిక. ఈడుకి తగిన శక్తి లేదు; కాని ఆవేదన కూలంకషంగానూ, ఆవేశం అతివేలంగానూ వుంది. జాతికి దీనివల్ల యెక్కువంచి తేనా లాభమే; గాని నష్టం లేదు.

ఈసంగతి చాలామంది పెద్దలు అంగీకరించారు.

ప్రబుద్ధాంధ్రను నడపడంలో నేను నిమిత్తమాత్రుణ్ణి. కొమ్ములు తిరిగిన వ్యాసకర్తలు ప్రబుద్ధాంధ్రను నిర్వహిస్తున్నారు.

ఏవిధమైన సత్కారమూ చెయ్యాలేకపోవడం, చందా తక్కువ కావడంవల్ల పేజీలు పరిమితంగా పొందలైన అలంకారాలు లేకపోవడం, పులిమీద పుట్ట అన్నట్టు ఇన్నింటికీ సాయం, నేను "పద్య వ్యాసాలు ప్రకటించ"నని భీష్మించుక్కూచోడం —యింకా యెన్నో యిలాంటి కారణాలవల్ల వుత్సాహజనకంగా లేకపోయినా వారందరూ తమ విశిష్టరచనలతో ప్రబుద్ధాంధ్రకు ప్రత్యేకత సంపాదించి పెట్టారు.

ఇంకొక్క కారణంవల్ల కూడా ప్రబుద్ధాంధ్రకు గర్వించతగ్గ పదవి లభించింది. అదేమిటంటే? ఆధునికాంధ్రవాఙ్మయ నిర్మాతలయిన యువకవుల కందరికీ నూత్నచైతన్యం స టించిన వాగనుశాసనులు, రావుసాహెబు, పాధ్యాయ గిడుగు వెంకటరామమూర్తి గారు ఆంధ్రపత్రికల సంపాదకులకు ప్ర ద్వారా వొక దివ్యసందేశం వినిపించారు విడవలేక కొన్ని పత్రికల సంపాదకు గుర్తించలేకపోయినా వొక సత్యా చేసిన శోధనజ్యోతి అని ఆంధ్రవాఙ్మయచరిత్ర అది కీర్తించబడుతుంది. దాన్ని పురస్కరించుకున్న వరమానచంద్రులు గూడవిల్లి రామబ్రహ్మంచౌదరి గారు తమ ప్రజామిత్ర పత్రికలో సంపాదకీయాలు వ్యావహారికంలో ప్రకటిస్తూ తమ సేవాదీక్ష సత్య ధర్మప్రేమానుబద్ధం అని ధృవపరుచుకున్నారు.

ప్రబుద్ధాంధ్ర చెయ్యవలసిన పని చాలా వుంది. సంకల్పమూ, ప్రయత్నమూ కూడా తక్కువగా లేవు; కాని అనుకూల్యాలు తక్కువ. సముద్రం యీదాలి. అదే చేస్తున్నాను.

ఈసంవత్సరం అంతటికీ "నేను చేశా" నని చెప్పకో తగ్గ పని హిందీ దురాక్రమణాన్ని అడ్డుకోడం వొక్కటే. "హిందూదేశానికి సామాన్య

ఎప్పుడో ఆచరణలో పెట్టతగి వున్న ఆసూచనకి నేనూ తల వొగ్గుతాను; కాని అది యిప్పుడు మన ఆంధ్రులకు "జాతీయభాష" నంటూ చొరుచుకు వస్తోంది. ఈవిషయంలో యిప్పటికే చాలా అశ్రద్ధ జరిగింది. దీన్నింకా ముదరనివ్వడం ఆత్మహత్య చేసుకోవడమే. ఈవిపత్తుగురించి భారతి, చంద్రిక, ఆంధ్రభూమి, గోల్కొండపత్రిక, ప్రజామిత్ర, ఉషస్సు, చిత్రగుప్త, రెడ్డి, సత్యవాణి, వినోదిని— ఈ పత్రికలు పూర్తిగానూ, ఆంధ్రపత్రిక, గృహలక్ష్మి—ఇవి కొంతవరకూనూ నా వాదాన్ని బలపరిచాయి. ఆధునికాంధ్రవాఙ్మయాకాశంమీద ధృవతారల లాగ ప్రకాశించగల అచ్చమైన తెనుగు బిడ్డలనేకులు యీవిషయంలో నాకంటె యెక్కువ ఆవేశంతో నడుములు బిగించుకుని యుద్ధరంగానికి దుమికారు. హిందీకి ప్రతికూలంగా వారు చేస్తూ వున్న ఆందోళనం హిందీప్రచారకులను కొన్ని తట్టి వెనక్కి తిప్పింది. మరిన్ని విజయనగరం, వాల్తేరు (ఆంధ్రయునివర్సిటీ హాస్టలు), విశాఖపట్టణం, అనకాపల్లి, బాపట్ల, ఒంగోలు, మదరాసు...ఈస్థలాల్లో నా హేతువాదం విని అనేకులు తల లూపారు వొక్క సమదర్శిని, కృష్ణాపత్రిక మాత్రం యీ విషయంలో ముభావంగా వుండిపోయాయి. అయితే; అవి రెండూ నాతరఫు వాదానికి కూడా అవకాశం యిచ్చి—యీ రూపంగా నేనా పూర్తిగా తోడుపడ్డాయి; కాని యీ సందర్భంలో జరగవలసిన పని అంతా ముందే వుంది. ఈహిందీ వ్యామోహం మనవారు కోరి తలకెక్కించుకుంటూ వున్నది; కనక దీన్ని తగ్గించడానికి చాలామంది చాలా శ్రమపడవలసి వుంది.

ప్రబుద్ధాంధ్రను మళ్లీ ప్రారంభించే టప్పటికి దేశీయు లందరూ ఆర్థికసంకటంలో యిరుక్కుని వున్నారు. ఇప్పటికి కూడా అది యేమీ తగ్గలేదు. అయినా నేను పన్నెండు మాసాలలోనూ వేయి మందికి పైగా చందాదారులను సంపాదించగలిగాను.

వీరు కాక, ఈసాహసకార్యంలో యెంతో మంది విద్వాంసులూ, జమీందార్లూ, వర్తకులూ, భూస్వాములూ—వారిలో చాలామంది వాఙ్మయం మీద ప్రీతీ, కొందరు నాయెడల మైత్రీ, అందరూ ప్రబుద్ధాంధ్ర మీద ఆదరాభిమానాలూ చూపించి, వుత్సాహపరిమితాలైన విరాళాలు దయచేసి నాకెంతో సాయపడ్డారు. వారిలో ఆంధ్రయునివర్సిటీ వైస్ ఛాన్సెలరు సర్. సర్వేపల్లి రాధాకృష్ణయ్య పంతులు గారు విరాళం దయచెయ్యడమే కాకుండా నా ప్రయత్నం విని ఈకొత్తరూపంలో ప్రబుద్ధాంధ్ర ఆవశ్యకాన్ని నిర్దేశిస్తూ శుభచింతతో ఆశీర్వదించి నన్నెంతో ప్రోత్సహించారు.

ఇది యిలా వుండగా: ఉత్తరసర్కారులలో గొప్ప ముద్రాపకులై వున్న సరస్వతీ పవరు ముద్రాశాలాధిపతులు అద్దేపల్లి లక్ష్మణస్వామి నాయుడు గారున్నూ, కాగితాల వ్యాపారంలో ప్రముఖులై వున్న మాదేటి సన్యాసయ్య అండు సన్సు వారున్నూ ప్రబుద్ధాంధ్ర బాధ్యత అంతా తమదిగా భావించి రెండు మూడు సందర్భాల్లో యెప్పుడూ మరుపురాని సాహాయ్యం చేశారు. నిజంగా వారు ఉభయుల అవలంబనమూ లభించి వుండకపోతే ఈ పన్నెండు సంచికలూ నేనింత సక్రమంగా ప్రకటించ లేకపోయి వుందును.

మొత్తానికి ఈ సంవత్సరం అంతా నేను నెలకి నెలా చొప్పున తిరిగిన్ని చేతి సొమ్ము తగలకుండా దీన్ని నిర్వహించ లేకపోయాను. అయితే ఎలాంటి పరిస్థితుల్లోనూ కూడా పురుషకారాన్ని దిగదీసే నిరుత్సాహం మాత్రం నన్ను ముసురుకోలేదు. పైగా కసి యెక్కువయింది!

అగ్గీ గాలీ కలిసినట్టు ఇంగ్లీషూ దాని కంటేనూ హెచ్చుగా హిందీ యేకమై తెనుగు దేశంలో విలయతాండవం చేస్తూ వున్న యీ రోజుల్లో తెను

గులో పత్రికాప్రకటనం—వాఙ్మయసేవ చెయ్యబూనినవాడు ఈ మాత్రం బొప్పితో బయటపడ్డం సామాన్యవిషయం కాదు.

చందాలూ, విరాళాలూ, ఇప్పించడంలో నామిత్రులనేకులు చూపించిన శ్రద్ధ నాకు రోమాంచం కలిగిస్తోంది.

ఇలాగ సర్వవిధాలా నాకు సాయపడినవారందరికీ నాకృతజ్ఞతను విన్నవించుకుంటున్నాను.

నా మిత్రు లందరూ ముందు సంవత్సరం కూడా యిలాగే నన్ను కృతార్థుణ్ణి చేస్తా రని ఆశించి వున్నాను.

ఇంకా దీపం ఆరిపోలేదు

జాయింటు పార్లమెంటరీ కమిటీ వారి నివేదికను మనస్ఫూర్తిగా స్వాగతం చెప్పుకుంటున్నాను.

కర్జను ప్రభువు చేసిన బంగాళా విభజన బంగాళీలకు ఆత్మ సాక్షాత్కారం కలిగించింది. అలాగే యీ నివేదిక మన కళ్లు విప్పుతుం దని నమ్ముతున్నాను.

అయితే: బంగాళీలు, అప్పటి కప్పుడే కొంత నవీనవాఙ్మయం సృష్టించుకోడం ద్వారా ఆత్మగౌరవం అంటే యేమిటో తెలుసుకుని వున్నారు; కనక ఆసన్నివేశానికి సరిగా వారు తాళం వెయ్యగలిగారు.

మన కలాంటి దేమీ లేదు. అసలు మనకు ప్రత్యేకత అవసర మని కూడా వొకరు చెప్పవలసిన ట్టుంది.

ఈ కొరడాదెబ్బకి కూడా మేలుకోకపోతే ప్రపంచకంలో మన కిక తావు లే దన్న మాట.

కర్జను ప్రభువు బంగాళీలను విడదీశాడు; కాని కొందర్ని తీసుకుపోయి మరో జాతివారి కాళ్ళ కింద పడెయ్యలేదు. అంత మాత్రానికే వారు మిన్నూ మన్నూ యేకం చేసేశారు.

ఈనివేదిక అలా కాకుండా, తెనుగు దేశంలో నుంచి వొక పెద్ద మంగలాన్ని పూర్తిగా తెగ్గొట్టి మరో అల్పరాష్ట్రానికి అతికేస్తోంది. కొన్ని లక్షల ఆంధ్రుల్ని సమూలంగా విడదీసి మరొక చిన్న జాతివారికి అంటగడుతోంది.

అయితే: ఈసూచన యీవాళదా?

మన ప్రముఖుల దృష్టి యిలాంటి వాటిమీద లేదు. వారు సంపూర్ణస్వారాజ్యం అనే పర్వతాన్ని పూడబెరుక్కువద్దా మని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు వోఢ్రులతో తగువులు పెట్టుకుంటే అఖిలభారతజాతీయత దుర్బలమై పోతుం దని వారి భయం; కాని వోఢ్రులు చేస్తూన్న దదే అని వారికి బోధపడడం లేదు.

వొక్క వోఢ్రులకే కాదు, తతిమ్మా అందరికీ ప్రత్యేకజాతీయత ప్రధానమున్నూ, అఖిలభారతీయత అప్రధానమున్నూ. అసలు ప్రత్యేకవ్యక్తిత్వం దృఢపడితే గాని భారతీయత అనేది వుర్లక్క అని వారికి తెలుసును.

మనకో? మనకి ఆత్మజ్ఞానం వుంటే కాదూ యీ సంగతి తెలవడం?

ఓఢ్రరాష్ట్రానికి బరంపురం రాజధాని ట. సంపూర్ణస్వారాజ్యం రావడమే వస్తే అప్పటి కప్పుడే అది భవనాలూ అవీ పూర్తిగా తయారయిపోయి బిగుసుకుపోతుంది. సంపూర్ణస్వారాజ్యమే కాదు, దానికి పైది వచ్చినా అప్పుడు చెయ్యతగ్గది— "ఏం చేస్తాం మరీ? ఇప్పు డెలా విడదీస్తామూ? ఈభవనాలూ ఏర్పాట్లూ తల్లకిందులు చెయ్యడం ధర్మమా?" అని ధర్మపన్నాలు ఏకరువు పెట్టడం తప్ప మ రేమీ వుండదు.

ఇంతకీ: సంపూర్ణస్వారాజ్యం రావడం అంటూ వుంటే అప్పుడు మన కుండే హక్కులు వోఢ్రులకు మాత్రం వుండవూ; అది లేనప్పుడే ప్రగమనశీలురై పరభూములు ఆక్రమించుకో గలిగిన వోఢ్రులు అప్పుడు మాత్రం మనకంటే హెచ్చు స్థితిలో వుండరూ?

ఏతావతా, మనకి అహంకారమమకారాలు ఎప్పుడో చచ్చిపోయాయి. కాంగ్రెస్సు ధర్మమా అని వైరాగ్యం కూడా ముదిరిపోతోంది.

క్షేత్రం యెంత మంచి దయినా, వర్షాలు కూడా అదునులోనే పడినా, విత్తనం అంటూ వుంటే కదా అక్కడ అంకురం యేర్పడడానికీ?

ఆలోచించి మరీ చెప్పండి

"ఎవరికి వారు దమ మాతృభాషను గూడ ఇతర భాషలను నేర్చు కొనునంతటి యుత్సాహముతో నేర్చుకొనగోరదము".

ఆంధ్రపత్రిక (౧౬-౧౧-౩౮)

"అంగా దంగా త్సంభవసి" అని చెప్పకో తగ్గ తండ్రి కూడా తల్లి యెదుట లిగాడు. సృష్టిలో తల్లికి గల పదవి మరే వస్తువుకీ లేదు.

ఎవ రైనా దేవుణ్ణీ, అమ్మనీ యెదుట నుంచో బెట్టి "ఏ కావలు కావా?" అని అడిగితే నేను "అమ్మే" అని నిక్కచ్చిగా చెబుతాను.

తల్లియొక్క మహాత్వం తెలియ తగ్గ శక్తి యెవరికీ లేదు. తల్లి ఋణం తీర్చుకో గలిగే సామర్థ్య మున్నూ లేదు.

బిడ్డని చూసుకుని తల్లి పొందే సంబరం యెలాంటిదో నిర్వచించడానికీ, యెంతటిదో పరిమితి చెప్పడానికీ యేమీ సాధనాలు లేవు. అది అవాఙ్మానసగోచరం.

ఆనందో న్మేషంతో కలకలలాడే తల్లి మొగం చూడగలవారికే ఋణవిముక్తి. దాని కంత కంటే మరో దారి లేదు.

"జననీ, జన్మభూమి శ్చ" అన్న సూక్తి సత్యాన్ని ఉపదేశించడం లేదు. హృదయానికి ఉత్తేజనమున్నూ కలిగించడం లేదు. ఏమంటే! అది అసమగ్రం. దాన్ని కూర్చిన కవి అవర్గంలో తల్లి భాషను చేర్చలేక పోయాడు.

అతను తన తల్లి భాషను విడిచిపెట్టి సంస్కృతి భాషలో మునిగిపోయాడు. అందుచేతే అతగాడికి తల్లిభాషతోచ లేదు.

అతను మాతృదూరుడు. ఇంతే కాదు. ఇంకానూ.

వంటపూటమ్మ అమ్మ అవుతుందా? అసలా మొని అమ్మతో పోల్చడాని కైనా వీలుందా? ప్రతీవాడికీ ఇతరభాష అలాంటిదే.

తల్లి భాష విడిచి ఇతరభాష నేర్చుకుని వాడు, తల్లి భాషతో కాక యితరభాషతో మాట్లాడే వాడూ, తల్లి భాషలో కాక యితర భాషలో ఆనందించే వాడూ తల్లి లేని బిడ్డ.

ఇంటో తల్లి ఆకలితో మాడిపోతూ వుండగా వీధిలో బిచ్చకత్తెలకు ముష్టి వెయ్యడం యెలాంటిదో, తల్లి భాష పోషణ లేక బిక్కు బిక్కు మంటూ వుండగా పరభాషా ప్రచారం చెయ్యడం అలాంటిది.

తల్లి భాష నేర్చుకునే టంతటి వుత్సాహంతో పరభాష నేర్చుకో మనడం కూడా తప్పే. అలాంటప్పుడు ఇతర భాషలను నేర్చుకునే టంతటి వుత్సాహంతో మాతృభాష నేర్చుకోమనడమా?

చెప్పలేదూ ఉద్దేశం అదే

ఉన్నవ రాజగోపాలకృష్ణయ్యగారు ఇప్పుడు మన దేశంలో జరుగుతూ వున్న హిందీప్రచారంవల్ల మన తెనుగుభాషకి అపకారం జరగడం లేదంటున్నారు.

నిజంగా, వారలా అనకపోతేనే మనం ఆశ్చర్యపడాలి. ఏమంటే? మన దేశంలో హిందీప్రచారోద్యమం సాగిస్తూ వున్న ప్రముఖుల్లో వారొకరుగా వున్నట్టుంది. దీనికి సాయం, మొన్న మొన్ననే వుత్తరదేశయాత్ర చేసి, హిందూస్థానీలకు తమ హిందీసేవలు నివేదించుకుని, వారి బుజ్జగింపులు గడించుకుని వచ్చి వున్నారు వారు.

చివరికి వారిలా రాశారు.

"హిందీభాషాప్రచారమువలన మాతృభాషాభివృద్ధికి నిరోధము కలుగుచున్నదను విమర్శ బయలు దేరినదే గాని వాస్తవమునకు హిందీప్రచారాభివృద్ధి విమర్శింపదగినంత స్థితికి రాలేదు. ఇంకను విరివిగా ఆంధ్రదేశమందు ప్రచారము గావలసి యున్నది. ఇప్పటికిని ధారాళముగా హిందీ మాట్లాడువారు, ఉపన్యాసము లివ్వగలవారు చాల కొలదిమంది మాత్రమే కలరు. రాష్ట్రభాషాపరీక్షయందుత్తీర్ణులయిన వారు సహితము పుస్తకములను జదివి అర్థము చేసికొనగలరే గాని మాట్లాడజాలకున్నారు. ఇందులకు కారణము హిందీవాతావరణము లేకుండుటయే గనుక ఆంధ్రదేశమునందు హిందీవాతావరణమును గల్పించిననే గాని భాష స్థాయిగా ప్రచారము కాజాలదు. ఈవాతావరణమును గల్పించుటకు వాగ్వర్ధనీసభలు, నాటకసమాజములు, వార్తాపత్రికలు తోడ్పడగలవు. ఈసాధనములనే హిందీప్రచారకులు భాషాభివృద్ధికి ద్విగుణితోత్సాహముతో కృషి చేయుదురు గాక"

కృష్ణాపత్రిక (౧౦–౧౧–౩౪)

హిందీప్రచారం విషయంలో యిలాంటి పరాకాష్ఠ హిందూస్థానీలకు గూడా వుంటుందని తోచదు. ఏమంటే? తెనుగు దేశంలో హిందీవాతావరణం వుండకపోవడమే సహజమని వారు తెలుసుకోగలిగి వుంటారు. ఇంతే కాక: తమ దేశంలో హిందీవాతావరణం లేనందుకు వొక్క తెనుగువారు తప్ప మరెవ్వరూ వాపోరని కూడా వారు తెలుసుకుని వుంటారు. కనక వారేనా యిలాంటి రాతలు రాయడానికి సాహసించలేరు.

దక్షిణభారతానికీ, వుత్తరభారతానికీ సంబంధం, వుందా లేదా అన్నంతే. దక్షిణదేశభాషల కుటుంబం వేరూ, వుత్తరదేశభాషల కుటుంబం వేరూనూ, పైగా మాహమ్మదీయులీఖండంలో లేనే లేరన్నంత తక్కువగా వున్నారు. ఉన్నవారేనా ప్రాంతీయభాషలు నేర్చుకోవలసిందే; కాని తమ వురుదూతో బయట చెలామణీ కాలేరు. మదరాసు బెంగుళూర్లవంటి మిశ్రస్థలాల్లో ప్రజ అక్కడి ప్రధానభాషల పరిచయం సంపాదించుకొనే వున్నారు. అన్నిటికీ పైని భిన్నప్రాంతీయుల సందర్భ యింగ్లీషు సర్వతోముఖంగా కలుపుతోంది. దానితో సకలవ్యవహారాలూ నిరాటంకంగా జరిగిపోతున్నాయి.

ఇలాగ—ఇన్ని కారణాలవల్ల దక్షిణభారతంలో హిందీప్రసక్తి లవలేశమూ లేదు.

ఇలాంటి స్థితిలో యిక్కడ—తెలుగు దేశంలో హిందీవాతావరణం కలిగించడం అంటే యేమన్నమాట?

ఇంగ్లీషు స్థానే హిందీని ప్రవేశపెడతామని హిందీప్రచారకులు ప్రజలకి ముఖపిధానం చేస్తున్నారు. మా ప్రయత్నాలు కూడా ఇంగ్లీషుని తగ్గించడానికే; కాని యిప్పుడింగ్లీషు అనుభవిస్తూ వున్న పదవి హిందీకి భుక్తపరచడానికి వల్లకాదు. ఇద్దరు తెనుగువాళ్లు ఇంగ్లీషు మాట్లాడుకోడం తప్పంటే యీ నిషేధం హిందీకి కూడా తగిలేదే కాదూ? శాసనసభలలోనూ, న్యాయస్థానాలలోనూ, పాఠశాలలలోనూ, కళాశాలలలోనూ, కార్యస్థానాలలోనూ రాష్ట్రీయప్రభుత్వాల వ్యవహారాలన్నీ రాష్ట్రీయభాషల్లో జరగవలసినవే, ఇప్పుడివన్నీ ఇంగ్లీషులో జరుగుతూ వుండడం ఆక్షేపించి హిందీలో జరగడం ఆమోదిస్తామని యెవరూ అనుకోలేనక్కరలేదు. హిందూదేశానికి సామాన్యభాష హిందీ అయినా, మరొకటయినా అది కేంద్రప్రభుత్వానికి మాత్రమే భాషగా వుండాలి.

ఇక బజార్లు. ఇప్పుడీ దేశపు బజార్లలో యెవరూ మూగలై వుండడం లేదు.

హిందీప్రచారకులు చూపగలిగిందల్లా యిక వొక్క కాంగ్రెస్సు అయితే యిప్పుడు హిందీ

నేర్చుకుంటూ వున్న స్త్రీపురుషు లందరూ కాంగ్రెస్సును నడిపేవా రేనా?

హిందీప్రచారకులు ఇక్కడ హిందీవాతావరణం కలిగిస్తా మంటే తెనుగును చంపితేనే అది నెరవేరుతుంది. వీరు ఇంగ్లీషుని తాకడానికి కూడా— అసలా వుద్దేశమే వీరికి లేదు. వుండడమే వస్తే వీరు ఇంగ్లీషుని తగ్గించడానికీ, ఆపదవి దేశభాషలకి సంక్రమింప చెయ్యడానికీ పూనుకుని వుందురు. కాంగ్రెస్సుప్రముఖులూ, హిందీప్రచారకులూ చేస్తూ వున్న హిందీప్రచారం దక్షిణదేశభాషలకు ఉసురుపెట్టడానికీ, అనేక ప్రతిష్ఠానలు నడపడానికి వినియోగపడవలసిన డబ్బంతా దుర్వ్యయం కావడానికీ తప్ప రాజకీయప్రయత్నాల కెంత మాత్రమూ సాయపడదు.

అడుగు, ముందుకి కాదు కిందికి

ఆసలాంధ్రసాహిత్యకళాపరిషత్తు గ్రంథరచనకి పోటీ యేర్పరచడమే బాగా లేదు. ఏమంటే? కవిత్వం ప్రోత్సహించ తగ్గది; కాని పోటీ పెట్ట తగ్గది కాదు. అనుభవించ తగ్గది; కాని పరీక్షించ తగ్గది కాదు. వొకరికి నచ్చిన కథాసరణి మరొకరికి నచ్చదు. వొకరికి జటిలంగా కనపడ్డ కథానిర్వహణం వేరొకరికి వదులు వదులుగా కనపడుతుంది. వొకరికి మృదువుగా తోచిన శైలి యింకొకరికి కటువుగా తోస్తుంది. వొకరికి మధురమధురంగా వున్న వర్ణనలు మరొకరికి చప్పచప్పగా వుంటాయి. కవిత్వం వున్న ప్రతీభాషలోనూ మొదణ్ణుంచీ వున్నదే యిదీ అంచేత యిది యిలా కాక, "తెనుగు భాషలో" ఫలానా ఫలానా తేదీలమధ్య ప్రకటించబడిన, ఫలానా ఫలానా రకాల గ్రంథాలలో మా దృష్టికి వుత్తమంగా తోచినవాటికి యింతింతేసి పారితోషికాలిస్తా" మని ప్రకటించి వుంటే నిరాక్షేపణీయంగా వుండేది. నోబుల్ బహుమానం పద్ధతి తెలిసివుండీ కూడా పరిషత్తు యీ పద్ధతి అవలంబించడం యేమంత సమంజసంగా లేదు.

అయినా, దేశంలో కొంతకి కొంత ప్రారంభమై వుంది కనక యీ పోటీపద్ధతి పక్షాంతరంగా అంగీకరించినా చివరికి పరిషత్తు తేల్చిన పర్యవసానం పెదవి విరచతగ్గట్టయిపోయింది.

తా నివ్వ తలుచుకున్న డబ్బంతా వొక్కమొట్టుగా మందే యిచ్చేసినా అది నవలల మాట యెలా వున్నా శాస్త్రీయగ్రంథాల అచ్చుఖర్చులకు చాలదు. అలాంటప్పుడు అందులో సగంసగమే యివ్వడం—ఇంతే కాకుండా అసాధ్యనియమం వొకటి కల్పించి అది నెరవేరిస్తేనే తక్కిన సగమూ యిస్తాననడం గ్రంథకర్తలను బహూకరించడమూ కాదు. గౌరవించడమూ కాదు విశ్వసించడం కానే కాదు.

పోనీ, సగం డబ్బు బిగపడితే గాని కర్తలు తమ గ్రంథాలను అచ్చువేయించి ప్రకటించ రని అనుమానించిన పరిషత్తు ఆయిచ్చిన సగమేనా వారు అచ్చువేయించడానికే వినియోగిస్తా రని యెలా నమ్మగలిగిందీ? కర్తలు ఆగ్రంథాలు అచ్చువేయించి తనకి ఆరేసి ప్రతులు పంపితే గాని పరిషత్తు తక్కినా సగమూ యివ్వదు. సరే. అయితే యిచ్చిన సగమూ నష్టమే కాదూ!

అలాంటి ఉద్గ్రంథాలు ప్రకటించబడకపోవడం వాఙ్మయానికీ, జాతికీ కూడా నష్టమే—అపకారం కూడా కాదూ!

ఏవో కొన్ని పుస్తకాలను ప్రకటిస్తూనే పరిషత్తు తానే పోటీ యేర్పరిచి, తానే ప్రోత్సహించి, తానే రాయించి, తానే పరిశీలించి, తానే ఉత్తమాధమత్వాలు నిర్ణయించి, తానే యోగ్యతాపత్రాలిచ్చి, తానే బహూకరించిన గ్రంథాలు తాను సొంతంగా ప్రకటించకపోవడం ప్రశంసాపాత్రం అవుతుందా?

మొత్తానికి గొప్ప ఆశయంతో యీ పనికి పూనుకున్న పరిషత్తు సంకుచితచిత్తంతో కాదు; గాని దూరాలోచన చెయ్యక చివరికి రసాభాసం చేసింది.

అయిం దేదో అయిపోయింది అయితే యీ సంగతి ప్రజల కింకా బాగా వెల్లడి కాలేదు. కనక వెంటనే యింకో మాటు బాగా ఆలోచించి, ఆ గ్రంథాలను అతిశీఘ్రంగా—సొంతంగా ప్రకటించి గ్రంథకర్తల మనశ్శల్యాన్ని, సారస్వతప్రియుల అసంతృప్తినీ తొలగించడం చాలా మంచిది

దీని కేం చెబుతారూ?

"హిందీని రాష్ట్రేతరవ్యవహారాలలోనే వాడతా" మనీ "దానివల్ల తెనుక్కి అపకారం జరుగుతుందనడం హాస్యాస్పదం" అనీ కాంగ్రెసువారూ, హిందీప్రచారకులూ చెబుతూ వుంటారు. ఈమధ్య గాంధిగారు కూడా హిందీ ప్రయోజనం అంతే అని సెల విచ్చారుట.

అయితే: ౨౪–౧౧–౩౪ తేదీని బందరు నగరీయసంఘసభలో "ఇక ముందు కౌన్సిలు మీటింగులో జరిగే చర్చలు తెలుగులో జరుపవలసినదిగా" అధ్యక్షులు ప్రతిపాదించగా, పెనుమర్తి లక్ష్మీపతి శాస్త్రిగారు "హిందీభాషలో కార్యక్రమము జరిపించవలసినదిగా" సవరణ తెచ్చారు.

ఇక్కడ "ఫలితం యేమిటీ!" అని కాదు ప్రశ్న తెనుగు దేశంలో, తెనుగు నగరంలో, తెనుగు వారు చేసే చర్చలు "తెనుగులో పనికిరాదు. హిందీలో జరిగించా" లని వొక అక్షరాలా తెనుగు పెద్దమనిషి సవరణ పెట్టడం యేమన్న మాట?

కాంగ్రెసువారూ, హిందీప్రచారకులూ ముఖపిధానం చెయ్యబోతే లాభం లేదు. తెనుగు వాడిలో తెనుగుతనం యింకా దృఢపడలేదు. ఇప్పుడు హిందీని నెత్తిమీద పెట్టుకుంటే తెనుక్కి నాశనం తప్పదు.

మదరాసులో తెనుగు......?

ఈమధ్య రవీంద్రనాథటాగూరుగారు మదరాసు వచ్చినప్పుడు స్త్రీలూ, పురుషులూ కూడా అరవంలోనూ. యింగ్లీషులోనూ వారికి వినతిపత్రాలు సమర్పించారు.

తెనుగులో సమర్పించడానికి మాత్రం యెవరూ ముందుకి రాలేదు

ఏం?

ఇటీవల అసెంబ్లీ 'ఎన్నికల్లో సత్యమూర్తిగారిని నెగ్గించడానికి మదరాసులో వుండే తెనుగువారు చాలక, కాకినాడ మొదలయిన అచ్చతెనుగు పట్నాలనుంచి కూడా కొందరు వెళ్లి వున్నారు; కాని అప్పు డెవరూ అలాంటి పని చెయ్యలే దేం?

అసలు టాగూరుగారిని సత్కరించాలని చెప్పినవారూ, పూనుకున్నవారూ తెనుగువారేనే? డబ్బు కూడా తెనుగువారిదే యెక్కువగా పడిందే? వినతిపత్రాల్లో తెనుగుభాషకి చోటు లేకపోయిందేం?

తెనుగు భాష టాగూరువంటివారిని వినుతించడానికి పనికిరాదా? తెనుగువారి కీవిషయంలో యితరపరగణాలవా రెవరూ తాఖీదులు పంపలేదా?

మదరాసులో బంగాళీలు కొద్దిమంది మాత్రమే వున్నారు. అయినా వారు తమ ప్రత్యేకతను వెల్లడించుకున్నారు. అరవలు కూడా యిలాగే యెక్కడ వున్నా తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటారు. మదరాసులో తతిమ్మా అందరికంటే తెనగువారే యెక్కువ; కాని వారికి తెనుగుతనం......?

అడగక్కర్లేదు. "నేను, నాది" అనే భావాలే లేవు తెనుగువారికి.

అవును మరి. తెనుగువారు హిందీకోసం కొండలు పిండి కొడుతున్నారుగా? ఇక తెనుగెందుకూ?

ఛిక్! తెనుగు ఎంత దిక్కుమాలిన స్థితిలో వుందీ?